సంపుటి : 18
సంచిక : 44
Vol : 18
Issue : 44



RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

# పీపుల్స్ డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

కరీంనగర్, బుధవారం 8 ఏప్రిల్ 2026
Karimnagar, Wednesday 8 April 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

WANTED
పీపుల్స్‌డైరీ
దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
సెంటర్లు
◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్
Cell : 9493019044
9618509859

## ఇరాన్ అత్యాశ?

### భారత్‌కు గుబులు...

- హార్మూజ్‌పై టోల్ వసూలుకు ఇరాన్ ప్లాన్
- ఆ జలసంధిపై పూర్తి హక్కుల కోసం తహతహ
- అదేగనుక జరిగే భారత్‌పై భారం...
- భారీ జాక్‌పాట్‌పై కన్నేసిన ఇరాన్



పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ : పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణను ముగించేందుకు మధ్యవర్తుల ద్వారా అందిన 45 రోజుల తాత్కాలిక కాల్పుల విరమణ ప్రతిపాదనను తిరస్కరించిన ఇరాన్.. శాశ్వత పరిష్కారం కోరుకుంటున్నట్లు అమెరికాకు తెగేసి చెప్పింది. ఈ మేరకు చర్చలకు సంబంధించి అమెరికా ప్రతిపాదనలను తమ ప్రభుత్వం తిరస్కరించినట్టు ఇరాన్ అధికారిక వార్తా సంస్థ ఓ కథనం వెలువరించింది. ప్రపంచ చమురు సరఫరాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జల సంధిని తెరిపించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే.

**హార్మూజ్‌పై హక్కులు**

అయితే, హార్మూజ్‌పై తమకు పూర్తి అధికారం దక్కేలా అంతర్జాతీయ గుర్తింపు ఇవ్వాలనే సరికొత్త డిమాండ్‌ను ఇరాన్ తెరపైకి తెచ్చింది. ఇరాన్ డిమాండ్లలో హార్మూజ్ జల సంధిపై హక్కులు అత్యంత కీలకమైంది. ఎందుకంటే అది మంచి వ్యాపార నిర్ణయం. ప్రపంచ ఇంధన రవాణాలో ఈ జలసంధిదే కీలక పాత్ర. పర్షియన్ గల్ఫ్‌లోని అత్యంత (మిగతా 2లో...)



## తుదిదశకు కీలక లైన్

- తెలుగు రాష్ట్రాల రవాణా వ్యవస్థలో మార్పు
- విజయవాడ-కాజీపేట మూడో లైన్‌తో ఎన్నో ఉపయోగాలు
- ఈ మార్గంలో గణనీయంగా తగ్గనున్న రైల్వే ట్రాఫిక్ సమస్యలు
- గూడ్స్, పాసింజర్ రైళ్లకు ఎంతో సమయం ఆదా
- తగ్గనున్న ప్రయాణ సమయం

**పీపుల్స్‌డైరీ-కాజీపేట** : తెలుగు రాష్ట్రాల మధ్య అత్యంత కీలకమైన విజయవాడ-కాజీపేట రైల్వే మార్గంలో మౌలిక సదుపాయాల కల్పన వేగంగా జరుగుతోంది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో అత్యధిక రద్దీ కలిగిన ఈ మార్గంలో చేపట్టిన మూడో రైల్వే లైన్ ప్రాజెక్టు పనులు ఇప్పుడు తుది దశకు చేరుకున్నాయి. మొత్తం 219 కిలోమీటర్ల మేర చేపట్టిన ఈ మార్గంలో ఇప్పటికే 199 కిలోమీటర్ల వరకు ట్రాక్ నిర్మాణం, విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. మిగిలి ఉన్న స్వల్ప పనులను సైతం రైల్వే శాఖ వేగంగా పూర్తి చేస్తోంది. త్వరలోనే అన్ని పనులను పూర్తి చేసి ఈ రైల్వే లైన్‌ను పూర్తి స్థాయిలో రైళ్ల రాకపోకలకు అందుబాటులోకి తీసుకురానున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఈ కొత్త లైన్ అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య ప్రయాణ సమయం తగ్గడంతో పాటు, ప్రయాణికుల రద్దీ కూడా తగ్గనుంది. అలాగే రవాణా వ్యవస్థలో మార్పులు రానున్నాయి.అంతేకాదు ఈ రైల్వే లైన్ (మిగతా 2లో...)

## హార్మూజ్ దాటిన మరో రెండు భారతీయ గ్యాస్ ట్యాంకర్లు

- ఇంకా చిక్కుల్లోనే 16 నౌకలు!
- ఆ నౌకల్లో 433 మంది సిబ్బంది?
- ఇప్పటివరకు 10 నౌకలు క్షేమంగా తీరానికి

పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో యుద్ధం ముదురుతున్న కొద్దీ ప్రపంచ వాణిజ్యానికి గుండెకాయ వంటి హార్మూజ్ జలసంధి వద్ద ఉత్కంఠ నెలకొంది. ఈ ఉద్రిక్తతల నడుమే భారత్‌కు ఒక ఊరటనిచ్చే వార్త అందింది. పర్షియన్ గల్ఫ్‌లో చిక్కుకుపోయిన భారతీయ నౌకల్లో మరో రెండు ఎల్‌పీజీ ట్యాంకర్లు సురక్షితంగా జలసంధిని దాటి భారత తీరానికి బయలుదేరాయి. కేంద్ర నౌకాయాన మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించింది. మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి ముఖేష్ మంగళ్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 46,650 టన్నుల ఎల్‌పీజీ లోడ్‌తో వస్తున్న గ్రీన్ సాన్వి నౌక ఏప్రిల్ 7వ తేదీన భారత పోర్టుకు చేరుకోనుంది. అలాగే 15,500 టన్నుల గ్యాస్‌తో వస్తున్న గ్రీన్ ఆశా ఏప్రిల్ 9వ తేదీ నాటికి భారత తీరాన్ని తాకనుంది. ఫిబ్రవరి 28వ తేదీన యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు మొత్తం ఎనిమిది భారతీయ గ్యాస్ ట్యాంకర్లు (మిగతా 2లో...)



## పంచాయతీ రోడ్డు మాయం...

- రైతుల బతుకు ఆగం..
- గ్రానైట్ కోసం గ్రామ మార్గం త్యాగం?
- 400 మీటర్లు గల్లంతు... 290 మీటర్లు కబ్జా
- 'నెలరోజుల్లో రోడ్డు వేస్తామని మోసపు హామీ
- 5 ఏళ్లుగా ఎదురు చూపులు

**కేసముద్రం, ఏప్రిల్ 7 (పీపుల్స్ డైరీ )** : గ్రామ అభివృద్ధికి ఆధారం కావాల్సిన పంచాయతీ రాజ్ రోడ్డు... ఇప్పుడు అక్రమ గ్రానైట్ తవ్వకాల బారిన పడింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్పణపల్లి గ్రామంలో మెడ్ వెస్ట్ గ్రానైట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చర్యలు రైతుల బతుకును తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి.

గ్రామంలోని ప్రధాన రాకపోకల మార్గమైన పంచాయతీ రోడ్డు సుమారు 400 మీటర్లు, అదనంగా 290 మీటర్ల డైవర్షన్ మెటల్ రోడ్డు కంపెనీ కబ్జా చేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ మార్గం ద్వారా రైతులు తమ పొలాలకు వెళ్లే పరిస్థితి ఉండగా, ప్రస్తుతం పూర్తిగా మూసివేయబడింది. (మిగతా 2లో...)





## తల్లిదండ్రులకు అలర్ట్

- వేసవిలో పిల్లలపై నిఘా పెట్టండి
- ఇంటర్నెట్‌లో ఏం చూస్తున్నారో కన్నేయండి
- డిజిటల్ వ్యసనం బారిన పడకుండా చూసుకోండి
- పేరెంట్స్‌కు సజ్జనార్ కీలక సూచనలు

2లో



## గణపసముద్రంపై మట్టిమాఫియా పంజా!

2వ పేజీలో..

- అనుమతుల్లేకుండా రాత్రిపగలు తవ్వకాలు!
- చెరువు గర్భం కోస్తున్న అక్రమార్కులు...!
- ట్రాక్టర్లతో యథేచ్ఛగా మట్టి తరలింపు...!
- చూస్తూ ఊరుకుంటున్న అధికారులు...?
- గ్రామస్తుల్లో ఆగ్రహం, చర్యల కోసం డిమాండ్

## శత్రువుకు గట్టి హెచ్చరిక

- ఇండియన్ ఆర్మీకి కామికేజ్ డ్రోన్లు
- సరికొత్త టెక్నాలజీ డెవలప్

పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ : ఇండియన్ ఆర్మీ గొప్ప ఘనత సాధించింది. యుద్ధ సమయంలో శత్రువుకి ముచ్చెమటలు పట్టించే సరికొత్త టెక్నాలజీని అభివృద్ధి చేసింది. రక్షణ రంగం లో గణనీయమైన మార్పులు వస్తున్న ప్రస్తుత తరుణంలో, ఇండియన్ ఆర్మీ లేటెస్ట్ టెక్నాలజీ తో రూపొందించిన 'కామికేజ్' డ్రోన్లను తన అమ్ములపొదిలోకి చేర్చుకుంది. ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో చేపట్టిన ప్రాజెక్ట్ ఇది. స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ డ్రోన్లు సరిహద్దుల్లో సెక్యూరిటీని మరింత కట్టుదిట్టం చేయనున్నాయి. 'ఇన్‌సైడ్‌ఎఫ్‌పీవీ' అనే స్టార్టప్ కంపెనీ ఈ విజయం సాధించింది. గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన ఈ కంపెనీతో 2025 డిసెంబర్ లో భారత రక్షణ శాఖ సుమారు రూ. 10కోట్ల విలువైన (మిగతా 2లో...)



## బంతి అనుకుని బాంబుతో ఆడుకున్న పిల్లలు

- చేతిలో పేలడంతో ఇద్దరు చిన్నారులకు తీవ్రగాయాలు
- అందులో ఒకరి పరిస్థితి విషమం
- ఆ బాంబు ఎక్కడి నుంచి వచ్చింది?

పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ : ఒడిశా గంజాం జిల్లాలోని ఒక గ్రామంలో 14 ఏళ్ల ఓం ప్రకాష్ భూయాన్, 8 ఏళ్ల గణేష్ భూయాన్ అనే ఇద్దరు బాలురు తమ ఇంటి సమీపంలో ఆడుకుంటున్నారు. ఆ సమయంలో వారికి బంతి ఆకారంలో ఉన్న ఒక గుర్తు తెలియని వస్తువు కనిపించింది. అది ఆడుకునే బంతి అని భావించిన ఆ చిన్నారులు.. దానిని చేతుల్లోకి తీసుకుని ఒకరికొకరు క్యాచ్‌లు విసుకోవడం ప్రారంభించారు. అయితే దురదృష్టవశాత్తూ ఆ వస్తువు ఓం ప్రకాష్ (మిగతా 2లో)

## ప్రేతాత్మకు గుడి కట్టి పూజలు...

- శాంతి కోసం కోళ్లు, మేకలు బలి
- ఎందుకో తెలుసా....?
- విచారణ చేపట్టిన విద్యాశాఖ

పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ : కాలేజీలో తరచూ విద్యార్థినులు స్పృహ కోల్పోవడం,అకస్మాత్తుగా వారు అనారోగ్యానికి గురికావడంతో అక్కడ దెయ్యాలు, ప్రేతాత్మలు తిరుగుతున్నాయనే వదంతులు వేగంగా వ్యాపించాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తలో రూ.100 చొప్పులు చందాలు వేసి.. కాలేజీ ప్రాంగణంలోనే చిన్న గుడికట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేకాదు, శాంతికోసం కోళ్లు, మేకలను కూడా బలిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని బాగేశ్వర్ జిల్లా కౌసానిలో చోటుచేసుకున్న ఈ ఘటన విద్యాశాఖ దృష్టికి చేరడంతో అధికారులు విచారణకు ఆదేశించారు. వివరాల్లోకి వెళ్తే.. హిమాలయ పర్వతాల సమీపంలోని (మిగతా 2లో...)

# ఇరాన్ అత్యాశ?

(మొదటి పేజీ తరువాయి)

ఇరుకైన 35 కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ జల మార్గంపై భౌగోళికంగా ఇరాన్, ఒమన్ నియంత్రణను కలిగి ఉన్నాయి. అమెరికా-ఇజ్రాయెల్ దాడులు ప్రారంభానికి ముందు రోజూ 100- 135 ట్యాంకర్లు ఈ జలసంధి ద్వారా రాకపోకలు సాగించేవి. దీని ద్వారా రోజుకు 20-25 మిలియన్ బ్యారెళ్ల క్రూడాయిల్ రవాణా అయ్యేది. వీటిలో అధిక భాగం భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా వంటి ఇతర ఆసియా దేశాలకే వెళ్తోంది.

ఈ నేపథ్యంలో హర్మూజ్‌పై ఇరాన్‌కు పూర్తి అధికారం దఖలుపడితే ఆర్థికంగా వారికి గొప్ప ప్రయోజనం కలుగుతుంది. ఒక్కో ట్యాంకర్ నుంచి టోల్ ఫీజు కింద కనీసం 1-1.5 మిలియన్ డాలర్లు వసూలు చేసినా.. కేవలం క్రూడాయిల్ నౌకల ద్వారానే నెలకు ఏకంగా 4.5 బిలియన్ డాలర్ల మేర ఆదాయం (భారత కరెన్సీలో దాదాపు రూ.41,800 కోట్లు) వస్తుంది. అందుకే హర్మూజ్‌పై నియంత్రణ కోసం ఇరాన్ నాయకత్వం పట్టుబడుతోంది. ఇరాన్ డిమాండ్ నెరవేరితే భారత్ సహా ఇతర ఆసియా దేశాలపై ఆర్థిక భారం పడుతుంది. ఏదేమైనా హర్మూజ్ కేవలం జలమార్గం కాదు.. ఇరాన్ చేతిలో ఉన్న శక్తివంతమైన ఆర్థిక అస్త్రం.

### భారత్‌పై ప్రభావం

హర్మూజ్ మీదుగా ప్రయాణించే నౌకలను టోల్ ఫీజు విధిస్తే.. ఆ అదనపు భారం భారత దిగమతులపై పడుతుంది. దీనివల్ల రవాణా ఖర్చులు పెరుగుతాయి. బీమా ప్రీమియం పెరిగి తత్ఫలితంగా ఇంధన ధరలకు రెక్కలొస్తాయి. ఒక్కో బ్యారెల్ బ్రెంట్ క్రూడ్‌పై 4 నుంచి 15 డాలర్ల వరకు అదనపు భారం పడొచ్చని, ఇది 25 డాలర్లకు కూడా చేరుకోవచ్చిన విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే భారత ప్రభుత్వం ఎక్సైజ్ సుంకం తగ్గించి, చమురు కంపెనీలకు మద్దతు ఇవ్వడం ద్వారా ప్రజలపై భారం పడకుండా చర్యలు తీసుకుంది. కానీ,దీనిని దీర్ఘకాలం కొనసాగించడం కష్టం. ఇరాన్ టోల్ విధిస్తే ఖర్చు భారీగా పెరుగుతంది.

# పంచాయతీ రోడ్డు మాయం...

(మొదటి పేజీ తరువాయి)

పొలాలకు దారి లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రోడ్డు లేకపోవడంతో రైతులు తమ వ్యవసాయ భూములకు చేరుకోవడం కష్టసాధ్యం అవుతోంది. పంట పనులు నిలిచిపోయే దశకు చేరుకున్నాయి. కొందరు రైతులు కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు వెళ్లలేక నష్టాలు చవిచూస్తున్నారు.




### హామీలు గాల్లో కలిపారు

గ్రానైట్ సంస్థ మొదట్లో "ఒక నెలలో మెటల్ రోడ్డు వేస్తాం" అని హామీ ఇచ్చింది. కానీ ఆ మాటలు వాస్తవం కాలేదు. ఐదేళ్లు గడిచినా రోడ్డుకు జాడ లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### రోడ్డుపైనే తవ్వకాలు... చట్టాలెక్కడ?

పంచాయతీ రోడ్డు ప్రజల వినియోగానికి చెందినది. అలాంటి రోడ్డుపైనే గ్రానైట్ తవ్వకాలు జరపడం చట్ట విరుద్ధమని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

### అధికారుల మౌనం... విమర్శల వెల్లువ

ఇంత పెద్ద సమస్య ఉన్నప్పటికీ పంచాయతీ రాజ్, రెవెన్యూ, మైనింగ్ శాఖలు స్పందించకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం తోఉన్నారు.

### వెంటనే రోడ్డు పునరుద్ధరణ చేయాలి : గ్రామ రైతులు

రైతులకు రాకపోకల సౌకర్యలను దృష్టిలో ఉంచుకొని అక్రమ తవ్వకాల నిలిపివేయాలని, కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలని లేకపోతే ఆందోళనలకు సిద్ధం అవుతామని, తక్షణ చర్యలు తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలుచేపడతామని గ్రామస్తులు, రైతులు హెచ్చరిస్తున్నారు.ఇది అభివృద్ధి కాదు దోపిడి అని,రోడ్డు లేకుండా రైతు బతుకు నిలబడదని తమ జీవనాధారాన్ని కాపాడాలని అర్పణపల్లి రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# గణపసముద్రంపై మట్టిమాఫియా పంజా

- అనుమతుల్లేకుండా రాత్రిపగలు తవ్వకాలు!
- చెరువు గర్భం కోస్తున్న అక్రమార్కులు...!
- ట్రాక్టర్లతో యథేచ్ఛగా మట్టి తరలింపు...!
- చూస్తూ ఊరుకుంటున్న అధికారులు...?
- గ్రామస్తుల్లో ఆగ్రహం, చర్యల కోసం డిమాండ్

**గణపురం, ఏప్రిల్ 07 (పీపుల్స్‌డైరీ) :** గణపురం మండల కేంద్రంలో ఉన్న గణపసముద్రం గ్రామానికి జీవనాడి. పచ్చని పంటలకి ఊపిరి, పక్షుల కిలకిలారావాలతో కళకళలాడే ప్రకృతి కవిత. కానీ ఇప్పుడు అదే చెరువు... అక్రమాల అంధకారంలో మునిగిపోయింది. రాత్రి చీకటిలోనే కాదు, పగలు వెలుగులో కూడా నిర్భయంగా సాగుతున్న మట్టి దందా విస్మయానికి గురిచేస్తోంది. ఇది కేవలం తవ్వకం కాదు, ప్రకృతి మీద జరుగుతున్న దాడి. భారీ యంత్రాల గర్జనతో చెరువు గర్భాన్ని చీల్చేస్తూ, మట్టిని ట్రాక్టర్లలో ఎక్కించి లేఅవుట్లకు అక్రమార్కులు తరలిస్తున్నారు. చట్టం అనే మాటకే భయపడని ధోరణితో విరుచుకుపడుతున్నారు. ప్రశ్న ఒక్కటే... ఇది ఎవరి అనుమతితో? సమాధానం మరింత కలవరపరిచేది-ఎవరూ అడ్డుకోవడం లేదు!

అధికారుల కళ్ల ముందే జరుగుతున్న ఈ దందా, వారి మౌనం వల్ల మరింత దూకుడుగా మారుతోంది. ఈ నిశ్శబ్దం... ఒక సాధారణ నిర్లక్ష్యం కాదు, అక్రమాలకు అండగా నిలిచినట్టు అనిపిస్తోందంటున్నారు జనం. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాల్సిన వ్యవస్థ... మాఫియాకు మద్దతుగా మారిందా అన్న అనుమానాలు గ్రామంలో మబ్బుల్లా కమ్ముకుంటున్నాయి. గ్రామస్తుల గుండెల్లో మండి పడుతున్న ఆవేదన ఇప్పుడు ఆగ్రహంగా మారుతోంది. "మా చెరువును కాపాడండి... మా భవిష్యత్తును రక్షించండి..." అంటూ వారి గొంతులు ప్రతిధ్వనిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖలు కళ్ళు తెరవాలి. అక్రమ మట్టి తవ్వకాలపై ఇనుప ముష్టితో చర్యలు తీసుకోవాలి. ప్రకృతి ధ్వంసం చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలి.

# శత్రువుకు గట్టి హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సాధారణంగా డిఫెన్స్ అగ్రిమెంట్లు జరిగాక, ఆయుధాలు సరఫరా చేయడానికి ఎన్నో ఏళ్ల సమయం పట్టొచ్చు. ఈ స్టార్టప్ కంపెనీ ఆయుధాలు డిప్లాయ్ చెయ్యడానికి తీసుకున్న సమయం ఎంతో తెలుసా..? కేవలం రెండు నెలల తక్కువ వ్యవధిలోనే వందలాది కామికేజ్ డ్రోన్లను ఆర్మీకి అప్పగించి సరికొత్త రికార్డు సృష్టించి చరిత్ర పుటల్లో నిలిచిపోయింది ఈ స్టార్టప్ కంపెనీ. ఈ డ్రోన్ల ప్రత్యేకతలు చాలా విశిష్టమైనవి. చిన్నవిగా ఉంటాయి..ప్రభావం ఎలా ఉంటుంది అనే సందేహాలు ఏ మాత్రం పెట్టుకోవద్దు. ఇవి చేసే అరాచకం.. విధ్వంసం చాలా ఎక్కువ. ఈ డ్రోన్లు రికార్డు వేగంతో..గంటకు గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో దూసుకువెళ్తాయి. దీనివల్ల శత్రువు కోలుకునే లోపే జరగాల్సింది జరిగిపోతుంది.. శత్రువును నేలమట్టం చేస్తుంది. ఈ డ్రోన్లు దాదాపు 2.5 కేజీల పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలవు. టార్గెట్ ని చేరుకున్న వెంటనే ఇవి పేలిపోయి శత్రువుకి తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయి. సముద్ర మట్టానికి సుమారు 2.5 కిలోమీటర్లు అంటే సుమారు 2500 మీటర్లు ఎత్తు వరకు ఎగిరే సామర్థ్యం ఈ డ్రోన్లకి ఉంది. కొండ ప్రాంతాల్లో కూడా ఇవి చాకచక్యంగా పనిచేస్తాయి. సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రువుల స్థావరాలను , టార్గెట్లను ఇవి సులభంగా చేరుకుని ధ్వంసం చేయగలవు.

# తల్లిదండ్రులకు అలర్ట్

**వేసవిలో పిల్లలపై నిఘా పెట్టండి**

**ఇంటర్నెట్‌లో ఏం చూస్తున్నారో కన్నేయండి**

**డిజిటల్ వ్యసనం బారిన పడకుండా చూసుకోండి**

**పేరెంట్స్‌కు సజ్జనార్ కీలక సూచనలు**



పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : హైదరాబాద్ నగరం లో లా అండ్ ఆర్డర్ పరిరక్షణకు పాటుపడుతూనే, సామాజిక అంశాలపై నగర ప్రజలకు నిత్యం దిశానిర్దేశం చేస్తూ సోషల్ మీడియా లో యాక్టివ్ గా ఉంటారు హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఆయన పోస్టులు వైరల్ కూడా అవుతుంటాయి. తాజాగా, సజ్జనార్ తల్లిదండ్రులకు చేసిన కీలక సూచనలు అందరి దృష్టిని ఆకర్షించాయి. వేసవి సెలవుల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు ఎలా మసలుకోవాలో ట్వీట్ చేశారు. సెలవలు వచ్చాయి ..పిల్లలు ఎంజాయ్ చేస్తారులే అని వాళ్ళని ఫ్రీగా వదిలేస్తే మొదటికే మోసం వస్తుందని హెచ్చరిస్తున్నారు సజ్జనార్. స్కూళ్లకు ఎలాగూ సెలవులు.. ట్యూషన్లు కూడా పెద్దగా ఉండవు.. అందుకే అధికశాతం పిల్లలు ఖాళీగా ఉండి, ఫోన్‌లు, టీవీలు, ల్యాప్‌టాప్‌లు , ట్యాబులతో కాలక్షేపం చేస్తున్నారు. సోషల్ మీడియా బానిసలుగా మారుతున్న ప్రస్తుత తరుణంలో, పిల్లలు పెద్దలు అనే తేడా లేకుండా ఫోన్లకి అతుక్కుపోతున్నారని సజ్జనార్ ట్వీట్ లో పేర్కొన్నారు.

వేసవి సెలవులు ఎంజాయ్ చేయడం లో తప్పేమీ లేదు కానీ.. ఆ వినోదం డిజిటల్ వ్యసనంగా మారకూడదని తల్లిదండ్రులను హెచ్చరించారు సజ్జనార్. సమ్మర్ హాలిడేస్ అంటే ఒకప్పుడు అమ్మమ్మ ఊరిలో పచ్చటి పొలాలు, పల్లెటూరు, అక్కడి మైదానాల్లో గల్లి క్రికెట్ సందడి గుర్తుకు వచ్చేవని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. కానీ, ప్రస్తుత సమాజంలో పిల్లలు మాత్రం కేవలం స్మార్ట్‌ఫోన్ వ్యసనం బారిన పడటం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని సజ్జనార్ పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ ఆఫీసు పనుల్లో పూర్తిగా నిమగ్నమై, పిల్లలతో నాణ్యమైన సమయాన్ని గడపకపోవడం వల్ల వారు డిజిటల్ వ్యసనం బారిన పడి ఒంటరితనానికి గురవుతున్నారని సజ్జనార్ పేర్కొన్నారు. దీంతో, పిల్లలు సోషల్ మీడియాలో అపరిచితుల మాయలో పడి భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని.. షార్ట్స్, రీల్స్ వంటి వ్యసనాలకు బానిసలై తిండి, నిద్ర మానేసి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు అని సీపీ సజ్జనార్ ఆవేదన వ్యక్తం చేశారు.

అదేవిధంగా, వారు ఇంటర్నెట్ లో ఏమి చూస్తున్నారు, ఎవరితో చాట్ చేస్తున్నారు అనే విషయాలపై నిరంతరం నిఘా పెట్టాలని సజ్జనార్ సూచించారు. మరీముఖ్యంగా పరీక్షా ఫలితాల విషయంలో పిల్లలకు పూర్తి దిశానిర్దేశం కల్పిస్తూ, వారి చేష్టలను నిత్యం గమనిస్తూ సరైన మార్గంలో నడిపించాలని సజ్జనార్ సూచించారు. తల్లిదండ్రుల అప్రమత్తతే తమ పిల్లల బంగారు భవిష్యత్తుకు మేలు చేస్తుంది అని..అదే వాళ్ళకి శ్రీరామరక్ష అని సీపీ సజ్జనార్ క్లారిటీ ఇచ్చారు.

# బంతి అనుకుని బాంబుతో ఆడుకున్న పిల్లలు

(మొదటి పేజీ తరువాయి)

భూయాన్ చేతిలోకి రాగానే పెద్ద శబ్దంతో పేలిపోయింది. పేలుడు ధాటికి ఓం ప్రకాష్ చేతులు, శరీరం తీవ్రంగా గాయపడ్డాయి. పక్కనే ఉన్న ఎనిమిదేళ్ల గణేష్‌కు కూడా గాయాలు అయ్యాయి. పేలుడు శబ్దం విన్న వెంటనే స్థానికులు ఘటనా స్థలానికి పరుగులు తీశారు. రక్తపు మడుగులో ఉన్న బాలుడిని చూసి షాక్‌కు గురయ్యారు. తీవ్రంగా గాయపడిన ఓం ప్రకాష్‌ను వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు దగ్గర్లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అతడిని బెర్హంపూర్ మెడికల్ కాలేజీకి రిఫర్ చేశారు. ప్రస్తుతం అక్కడ బాలుడికి అత్యవసర చికిత్స అందుతోంది. మరోవైపు చిన్నారి గణేష్ స్వల్ప గాయాలతో బయటపడటంతో అతడి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

### ఆ బంతి ఎక్కడి నుంచి వచ్చింది?

జనావాసాల మధ్యకు ఇంతటి శక్తివంతమైన పేలుడు పదార్థం ఎలా వచ్చిందనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. సాధారణంగా అడవి పందుల వేట కోసం లేదా పాత కక్షల నేపథ్యంలో ఎవరైనా నాటు బాంబులను అక్కడ వదిలి వెళ్లారా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. గంజాం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని.. ఆ పేలుడు పదార్థం మూలాలను కనిపెట్టేందుకు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈక్రమంలోనే పిల్లలపై ఎప్పుడూ ఓ కన్నేసి ఉంచాలని.. వారికి రోడ్లపై ఏమైనా దొరికితే తీసుకోనివ్వకూడదని చెప్పారు. ఏదైనా అనుమానాస్పద వస్తువు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరుతున్నారు.

# తుదిదశకు కీలక లైన్

(మొదటి పేజీ తరువాయి)

అందుబాటులోకి వస్తే ప్రయాణికులతో పాటు సరుకుల రవాణాకు కూడా ఇది ఉపయోగపడుతుంది. అలాగే నిత్యం వందలాది రైళ్లు తిరిగే ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్యలు కూడా తగ్గనున్నాయి. ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు కూడా ఆలస్యం కాకుండా, వేగంగా తమ గమ్యస్థానాలకు చేరుకుంటాయి.ఈ కొత్త లైన్ వల్ల గూడ్స్ రైళ్ల రాకపోకలను కూడా సులభతరం చేస్తుంది.ఈ రైల్వే లైన్‌లో పూర్తి స్థాయి విద్యుదీకరణ ఉండడం వల్ల ఇంధన ఖర్చులు తగ్గడమే కాకుండా కాలుష్యం కూడా తగ్గుతుంది.

ఈ కొత్త రైల్వే లైన్ రెండు రాష్ట్రాల మధ్య ప్రయాణాన్ని సులభతరం చేయడమే కాకుండా రెండు రాష్ట్రాలకు ఆర్థిక వారధిలా పనిచేయనుంది. ఇది అందుబాటులోకి వస్తే ఈ మార్గం వెంబడి ఉన్న పారిశ్రామిక కేంద్రాలు, వ్యవసాయ మార్కెట్లు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.



# వరంగల్‌లో వక్ఫ్ భూములపై కబ్జాదారులు కన్ను

- వందల ఎకరాల వక్ఫ్ భూములు అన్యాక్రాంతం
- సర్వే నంబర్లు మార్చి తప్పుడు రిజిస్ట్రేషన్లు
- మైనారిటీ పాఠశాలలు ప్రైవేటు అద్దె భవనాల్లో నిర్వహణ
- లక్షల రూపాయల అద్దెలు చెల్లిస్తూ ప్రభుత్వానికి గండి
- కబ్జాలకు గురైన వక్ఫ్ భూములను స్వాధీన పరచుకునేదెవరు..?
- ఖిల్లా వరంగల్ మండలంలో సర్వే నంబర్ 273,274,275,276 లో వక్ఫ్ భూములు నిజమేనా
- మతపరమైన,ధార్మిక,సామాజిక ప్రయోజనాలకు అంకితమైన భూములు
- ముస్లింలు దానం చేసిన ఆస్తులను ఆక్రమించడానికి ప్రయత్నం
- ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ చోద్యం చూస్తున్న అధికారులు
- కంటికి కానరాని సంబంధిత,వక్ఫ్ బోర్డు అధికారులు
- ఉన్నతాధికారులు చొరవతో వక్ఫ్ భూములు కాపాడాలని విన్నపం

**పీపుల్స్ డైరీ ప్రతినిధి వరంగల్ :** వరంగల్ నగరంలో వక్ఫ్ బోర్డు కు సంబంధించిన భూములు ఎకరాల కొద్ది ఉన్నప్పటికీ అన్యాక్రాంతం అవుతూ కబ్జా కోరుల చేతుల్లో పడి ఉన్నట్టు ఆ భూములను అక్రమ రిజిస్ట్రేషన్ లతో సామాన్యులను మోసం చేస్తూ పబ్బం గడుపుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఖిల్లా వరంగల్ మండలం ఉర్సు శివారు భూముల్లో వక్ఫ్ బోర్డు కు సంబంధించిన భూములు ఉండగా వాటిని పరిరక్షించే బాధ్యత సంబంధిత అధికారుల పై ఉంటుంది. అయినప్పటికీ వాటిని పట్టించుకోకుండా కొన్ని ఎకరాల భూములు అన్యాక్రాంతం అయ్యే లా ఉన్నాయని మైనారిటీలు వాపోతున్నారు. ఖిల్లా వరంగల్ మండలం లో ఉన్న వక్ఫ్ భూములు సంరక్షించేది ఎవరనేది ప్రశ్నార్ధకంగా మిగిలింది. ఖిల్లా వరంగల్ మండల పరిధిలో వక్ఫ్ భూమి కబ్జాలపై పూర్తి వివరాలు పీపుల్స్ డైరీలో.. వచ్చే సంచికలో....

# పేద యువతి వివాహానికి కళ్యాణమస్తు ద్వారా సహాయం...

**మట్టెవాడ, ఏప్రిల్ 07 (పీపుల్స్ డైరీ):** వరంగల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం సేవా దృక్పథంతో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "కళ్యాణమస్తు పథకం" ద్వారా వరంగల్ కాశిబుగ్గలో నివసిస్తున్న నిరుపేద ఆర్యవైశ్యులైన పద్మ శారద- వెంకటేశ్వర్లు దంపతుల కుమార్తె పద్మ శృతి వివాహం సందర్భంగా మంగళ సూత్రములు, మట్టెలు, రూ.3016/- నగదు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుండా ప్రకాష్ రావు అందచేశారు. ఈ సందర్భంగా గుండా ప్రకాష్ మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘంలో నిర్వహించు కళ్యాణమస్తుతో పాటు ఇతర పలురకాల సంక్షేమ పథకాలను ఆర్యవైశ్యులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు పాలారపు కృష్ణమూర్తి, యిరుకుల్ల పాపారావు, వెనిశెట్టి సదాకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# హార్మ్యూజ్ దాటిన మరో రెండు భారతీయ గ్యాస్ ట్యాంకర్లు

(మొదటి పేజీ తరువాయి)

ఈ ప్రమాదకరమైన జలసంధిని దాటగలిగాయి. అన్ని దేశాలకంటే మన దేశానికి చెందిన ఎక్కువ నౌకలే ఇప్పటి వరకు తీరాన్ని చేరుకొని రికార్డు సృష్టించాయి.

ఇంకా చిక్కుల్లోనే 16 నౌకలు.. 433 మంది సిబ్బంది

భారత్‌కు చెందిన కొన్ని నౌకలు సురక్షితంగా బయట పడినప్పటికీ.. ఇంకా 16 నౌకలు పర్షియన్ గల్ఫ్‌లోనే నిలిచిపోయాయి. వీటిలో 6 చమురు ట్యాంకర్లు, 3 కంటైనర్ షిప్పులు, 2 గ్యాస్ ట్యాంకర్లు (ఒకటి ఖాళీ, ఒకటి లోడ్‌తో) ఉన్నాయి. మిగిలినవి కెమికల్, బల్క్ క్యారియర్లు, డ్రెడ్జర్లు ఉన్నాయి. ఈ నౌకల్లో మొత్తం 433 మంది భారతీయ నావికులు ఉన్నారు. వీరి భద్రతపై కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేస్తోంది. యుద్ధం ప్రారంభమైన సమయంలో మొత్తం 28 భారతీయ నౌకలు ఈ ప్రాంతంలో ఉండగా.. ఇప్పటి వరకు 10 నౌకలు సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నాయి.

# ప్రేతాత్మకు గుడి కట్టి పూజలు...

(మొదటి పేజీ తరువాయి)

కౌసాని గ్రామంలో గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ఉంది. గత కొద్ది రోజులుగా ఇక్కడ చదువుతున్న విద్యార్థినులు ఉన్నట్టుండి కాలేజీలోనే కళ్లుతిరిగి పడిపోయి స్పృహ కోల్పోతున్నారు. దీంతో అక్కడ ఓ ప్రేతాత్మ తిరుగుతోందని, అందువల్లే విద్యార్థినులు భయభ్రాంతులకు గురై, స్పృహతప్పి పడిపోతున్నారనే పుకార్లు షికార్లు కొట్టాయి. ఈ ప్రచారంతో ఆందోళనకు గురైన విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామస్తులు.. దీనికి శాంతి పూజలు ఒక్కటే మార్గమని నిర్ణయానికి వచ్చారు.

ప్రేతాత్మ కోసం కాలేజీలోనే ఓ ఆలయాన్ని నిర్మించాలని వారు ప్లాన్ చేశారు. ఇందుకోసం విద్యార్థుల తల్లిదండ్రుల నుంచే చందాల రూపంలో రూ.100 చొప్పున వసూలు చేశారు. ఆ మొత్తంతోనే కాలేజీ ఆవరణలో ఓ చిన్న గుడి కట్టి, ప్రేతాత్మను శాంతింప చేయడానికి ప్రత్యేక పూజలను కాలేజీ సిబ్బంది, గ్రామస్తులు కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కోళ్లు, మేకలను కూడా బలి ఇచ్చారు.

ఈ వ్యవహారం విద్యాశాఖ దృష్టికి చేరడంతో విచారణకు ఆదేశించారు. వారంలోగా పూర్తిచేసి తనకు నివేదికను సమర్పించాలని బ్లాక్ స్థాయి అధికారికి బాగేశ్వర్ జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలు జారీచేశారు. ఇక, విచారణకు డీఈఓ ఆదేశించిన వెంటనే, ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. వివరణతో కూడిన ఆ వీడియోను కౌసాని కాలేజీ పేరెంట్స్ టీచర్ అసోసియేషన్ అధ్యక్షుడు పోస్ట్ చేశారు. అందులో కీలక వివరాలను ఆయన వెల్లడించారు.

# హెచ్‌పివి టీకాలు వేయిస్తున్న కార్పొరేటర్ పద్మ రవి



వరంగల్ ఏప్రిల్ 7 (**పీపుల్స్** డైరీ) : వరంగల్ నగరంలో గల 32 వ డివిజన్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మక టీకా హెచ్ పి వి టీకాలు పంపిణీ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పోరేటర్ పల్లం పద్మా రవి హాజరైనారు ఈ సందర్భంగా కార్పోరేటర్ మాట్లాడుతూ 14 సంవత్సరాలు ఉన్న బాలికలకు ఈ టీకా ఎంతో అవసరమని గర్భ దాల్చినపుడు క్యాన్సర్ రాకుండా ఎంతో ఉపయోగపడుతుందని ఈ టీకాను ప్రతి బాలిక కు తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టి వేయించగలరని కోరారు ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిత , మంజుల , వాణి , శ్వేతా, మౌనిక,స్వరూప, రామ. ఆశాలు మరియు సిబ్బంది పాల్గొన్నారు

# అక్రమంగా నిర్వహిస్తున్న “ప్రియాంక & భారతి క్లినిక్ లు” సీజ్

**జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కఠిన చర్యలు**




**ఆర్మూర్,ఏప్రిల్ 6(పీపుల్స్ డైరీ) :** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ కేంద్రంలో అక్రమంగా నడుస్తున్న “ప్రియాంక క్లినిక్” పై జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు కఠిన చర్యలు చేపట్టారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో క్లినిక్‌ను సీజ్ చేశారు. ఈ చర్యల సమయంలో పోలీసు సిబ్బంది కూడా హాజరయ్యారు. లభించిన సమాచారం ప్రకారం, ఈ క్లినిక్ అనేక సంవత్సరాలుగా ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా నడుస్తోంది. ఇక్కడ పురుషులు, మహిళల వివిధ వ్యాధుల చికిత్స పేరుతో శస్త్రచికిత్సలు కూడా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నాణ్యతలేని వైద్యం కారణంగా రోగులు ఆరోగ్యం పొందకుండా మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు. డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ.. గత 2025 వ సంవత్సరంలో కూడా డీఎంహెచ్ఓ రాజ్యశ్రీ ఫిర్యాదు మేరకు ఈ క్లినిక్‌ను సీజ్ చేసి, ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో విచారణలో ఉందన్నారు. అయితే క్లినిక్ యాజమాన్యం మళ్లీ అక్రమంగా ప్రారంభించి రోగులకు చికిత్స అందించడంతో తాజా ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ నిర్వహించగా క్లినిక్ తిరిగి నడుస్తున్నట్లు గుర్తించి, వెంటనే మళ్లీ సీజ్ చేసి బాధ్యులపై కఠిన చర్యలు ప్రారంభించినట్లు చెప్పారు. డాక్టర్ రవీందర్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, అక్రమ మరియు అనధికార వైద్య కేంద్రాలను ఆశ్రయించవద్దని, ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లోనే చికిత్స పొందాలని సూచించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. స్థానిక ప్రజలు కూడా ఇలాంటి నకిలీ వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న వారిపై ప్రభుత్వం, ఆరోగ్య శాఖ, పోలీసులు కఠినంగా వ్యవహరించాలని కోరారు.

# చట్ట సవరణ చేసి దళితులకు న్యాయం చేయాలి

**పస్క నర్సయ్య ఐజజ ప్రధాన కార్యదర్శి**



**ఆర్మూర్, ఏప్రిల్, 06 (పీపుల్స్ డైరీ) :** క్రిస్టియన్ మతంలోకి మారిన దళితులకు ఎస్సీ హోదా వర్తించదని సుప్రీం కోర్ట్ చేసిన తాజా వ్యాఖ్యలు దేశంలో సామాజిక న్యాయం పై పెద్ద చర్చకు దారితీసాయి. మతం మారినంత మాత్రాన దళితులపై జరుగుతున్న కుల వివక్ష అంతరించిపోదు అనే వాస్తవాన్ని ప్రభుత్వం, పాలకులు గుర్తించాలి. శతాబ్దాలుగా సామాజికంగా వెనుకబాటుకు గురైన దళితులు మతం మార్చుకున్న తర్వాత కూడా అదే వివక్షను ఎదుర్కొంటున్నారని పస్క నర్సయ్య ఐజజ ప్రధాన కార్యదర్శి,మాజీ ఎంపీపీ అన్నారు. అలాంటి పరిస్థితిలో మతం ఆధారంగా ఎస్సీ హోదా రద్దు చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. సమానత్వం, సామాజిక న్యాయం, మానవ హక్కుల పరిరక్షణ అనే రాజ్యాంగ విలువలను ఇది బలహీనపరుస్తుంది. ఈ అంశం కేవలం చట్ట పరమైనది మాత్రమే కాదు --- ఇది కోట్లాది దళితుల జీవనోపాధి, విద్య, ఉద్యోగ అవకాశాలకు సంబంధించిన విషయం. అందువల్ల కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ అంశంపై స్పష్టమైన నిర్ణయం తీసుకుని, మతం మారిన దళితులకు కూడా ఎస్సీ హోదా కల్పించేలా చట్ట సవరణ చేయాలి. కమిషన్లు ఏర్పాటు చేస్తూ కాలయాపన చేయడం కాకుండా, దళితుల న్యాయమైన హక్కులను వెంటనే అమలు చేయాలి. మతం ఆధారంగా దళితుల హక్కులను తొలగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. దళితుల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం మేము పోరాటం కొనసాగిస్తాము. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ అన్యాయాన్ని సరిదిద్దాలని డిమాండ్ చేస్తున్నాము.

# భాగ్యనగర్ తండా గ్రామ ప్రజల సమస్యల పరిష్కారం కోసం వినతి



భాగ్యనగర్ తండా గ్రామ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం పార్లమెంట్ సభ్యులు. రామసహాయం రఘురాంరెడ్డికి యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు. గుగులోత్ హచ్చు,హర్ష నాయక్ కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా సింగరేణి మండలం పరిధిలోని భాగ్యనగర్ తండా,సమీపంలోని ఐదు తండాలకు చెందిన రైతులు,రైతు కూలీలు ప్రతిరోజూ వ్యవసాయ పనుల నిమిత్తం రైల్వే ట్రాక్ దాటి తమ పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. రైల్వే అధికారులు ట్రాక్ దాటేందుకు అనుమతి నిరాకరిస్తుండటంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు. ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు వినతులు సమర్పించి నప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలే దని పేర్కొన్నారు. రైల్వే ట్రాక్‌ను అనుమతి లేకుండా దాటితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారని దీంతో ప్రజల్లో భయం నెలకొన్నదన్నారు. అందువల్ల జరుపుల బాలాజీ వ్యవసాయ భూమి సమీపంలోని రైల్వే స్తంభం నెంబర్ కె. ఎస్ /5/5 వద్ద అండర్ గ్రౌండ్ బ్రిడ్జి లేదా రైల్వే గేట్ ఏర్పాటు చేయించాలని ఎంపీని కోరినట్లు తెలిపారు. ఈ సమస్యను సానుకూలంగా పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటానని ఎంపీ రామ-సహాయం రఘురాంరెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు ఈ యొక్క కార్యక్రమంలో మండల నాయకులు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఎంపీ రఘురామ రెడ్డినీ ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా ప్రత్యేక చొరవ తీసుకొని తగిన పరిష్కార మార్గం చూపాలని కోరారు.

# కాలనీలకు వరద ముప్పు లేకుండా శాశ్వత పరిష్కారం

- **రూ.4 కోట్లతో రిటైనింగ్ వాల్ పనులకు శంకుస్థాపన**



**హసన్ పర్తి, ఏప్రిల్ 7 (పీపుల్స్ డైరీ) :** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 56వ డివిజన్ గోపాలపురం కాలనీలకు వరద ముప్పును శాశ్వతంగా నివారించే దిశగా కీలక అడుగు పడింది. ఊర చెరువు గట్టు ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో తెగిపోవడంతో పలు కాలనీలు ముంపుకు గురై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గోపాలపురం చెరువు గట్టు వద్ద బలమైన రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ. 4 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ పనులకు వరంగల్ ఎంపీ కడియం కావ్య, నగర మేయర్ గుండు సుధారాణి సమక్షంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్. నాగరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, గోపాలపురం ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను స్వయంగా పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు మళ్లీ తలెత్తకుండా ఉండేలా శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించామని చెప్పారు. రిటైనింగ్ వాల్ నిర్మాణంతో వరద నీరు కాలనీల్లోకి చేరకుండా నిరోధించవచ్చని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఎక్కడ సమస్యలు ఉన్నా వెంటనే స్పందించి పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో మౌలిక వసతులను బలోపేతం చేసి ప్రజలకు భద్రత కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, చేపట్టిన పనులు నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. గోపాలపురం ప్రజలు ఇకపై ముంపు భయం లేకుండా జీవించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే చెరువు ఆక్రమణలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటూ, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపనతో పాటు తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 512 కోట్ల నిధులతో పనులు ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఆశ కార్యకర్తల సేవలు అమూల్యం-జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

- **ప్రజారోగ్య పరిరక్షణలో ఆశా కార్యకర్తల సేవలు అమూల్యమైనవని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు.**
- **మంగళవారం టేకుమట్ల మండలం వెలిశాల గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు.**




**భూపాలపల్లి ఏప్రిల్ 7 పీపుల్స్ డైరీ :** ఈ సందర్భంగా నిర్వహించిన ఆశా కార్యకర్తలకు ఆశా డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11వ తేదీ వరకు ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వాటిని పక్కద్బందీగా అమలు చేయాలని వైద్య సిబ్బందికి ఆయన సూచించారు. ఆశా కార్యకర్తలు గ్రామ, మండల స్థాయిలో గర్భిణిలు సుఖ ప్రసవాలు జరిగేలా, ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తూ మాతా శిశు మరణాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతి ఆసుపత్రిలో ఎంతమందికి వైద్య సేవలు అందిస్తున్నారు, ఏ ఏ ప్రాంతాల నుండి వైద్య సేవలకు వస్తున్నారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు 70 మంది వరకు వైద్య సేవలకు వస్తున్నారని వైద్యులు తెలుపగా ఓపి సేవలు పెంచాలని సూచించారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పోషణ లోపం ఉన్న చిన్నారులు ఎంత మంది ఉన్నారు అని అడిగి తెలుసుకున్నారు. పోషణ లోపం ఉన్న చిన్నారులు లేరని తెలుపగా అభినందించారు. గ్రామం, మండలం వారిగా పోషణ లోపం ఉన్న చిన్నారుల జాభితా తయారు చేయాలని సూచించారు. బాల్యం నుండి ఆరోగ్యవంతమైన సమాజం తయారు కావాలని స్పష్టం చేసారు. ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగహన కల్పించాలని సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబొరేటరీని పరిశీలించి, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, పరీక్షల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ స్వరూప రాణి, ఎంపీడీవో అనిత, వైద్యులు డాక్టర్ నాగరాణి, హారిక, సర్పంచ్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మొరం తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు- కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్ ,ఏప్రిల్ 07:(పీపుల్స్ డైరీ ) :** అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తవ్వకాలు, రవాణా జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం అక్రమ మొరం, ఇసుక తవ్వకాలు, రవాణాపై గట్టి నిఘా కొనసాగిస్తున్నాయని అన్నారు. ఇందులో భాగంగానే సోమవారం ఆర్మూర్ డివిజన్ పరిధిలోని నందిపేట పలుగుట్ట ప్రాంతంలో అక్రమ మొరం తవ్వకాలు జరుపుతున్నారనే పక్కా సమాచారంతో సీసీఎస్ పోలీసులు సోమవారం దాడి జరిపారని తెలిపారు. ఈ సందర్భంగా ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు జరుపుతున్నారని గుర్తించి, స్థానిక తహసీల్దార్ సంతోష్ రెడ్డికి సమాచారం అందించగా, ఆర్.ఐ దివ్య అక్కడికి చేరుకుని పంచనామ నిర్వహించారని అన్నారు. ఈ సందర్భంగా మొరం తవ్వకాల కోసం ఉపయోగిస్తున్న మూడు టిప్పర్లు, రెండు జెసిబీలు, ఒక ట్రాక్టర్ ను సీజ్ చేసి నందిపేట్ ఎస్ హెచ్ ఓ శ్యాంరాజ్ కు అప్పగించడం జరిగిందని అన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ మొరం, ఇసుక తవ్వకాలు, రవాణాను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

# సీ ఎం ఆర్ ఏఫ్ చెక్కుల పంపిణీ

**ఎంపీ రామ సహాయం రఘురామ రెడ్డి చేతుల మీదుగా సింగరేణి మండల లబ్ధిదారులకు అందజేత.**



**సింగరేణి (కారేపల్లి) ఏప్రిల్ 7 (పీపుల్స్ డైరీ):** మండల లబ్ధిదారులకు ఎంపీ రఘురామ రెడ్డి చేతుల మీదుగా సుమారు 36 మందికి 8 లక్షల 81 వేల ఐదు వందల రూపాయల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సింగరేణి మండల ప్రజలకు ఏ సమస్య వచ్చినా. అందుబాటులో ఉంటానని అన్నారు. మండల సర్పంచ్ లు గ్రామపంచాయతీల అభివృద్ధికి దరఖాస్తులు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతి రావు. అజ్మీరా నరేష్. సర్పంచ్ లు అజ్మీరా ఉమా నరేష్. వడ్డే సులోచన రంగారావు. మోతీ వీరస్వామి. ధారావత్ వెంకటేశ్వర్లు. గూగులోతు కృష్ణవేణి వీరబాబు. దండు ప్రవీణ్. ఉండం రాఘవులు. దరావత్ హేమలత బాలాజీ. గూగులోతు వర లక్ష్మీ రాజు. కొమ్ము భద్రం. బానోత్ రూప్ల. పొడుగు పెంటయ్య. వార్డ్ మెంబర్ ఆదేర్ల అంజయ్య. మండల అధ్యక్షులు తలారి చంద్ర ప్రకాష్. రెడ్డి బోయిన జగ్గయ్య యాదవ్, గుంపిడి నాగేశ్వరరావు,పాటి నర్సయ్య,తోగర శ్రీను. జర్పుల ధోనీ. ఈసం లక్ష్మీ నర్సు. హర్ష నాయక్. నరేష్. బద్దె నాయక్. రవీందర్. తధి తరులు పాల్గొన్నారు

# గుంపెల్లగూడెం గ్రామ అభివృద్ధికి కీలక అడుగు

**ఎంపీని కలిసిన సర్పంచ్ కృష్ణవేణి**



**సింగరేణి (కారేపల్లి) ఏప్రిల్ 7 (పీపుల్స్ డైరీ):** గుంపెల్లగూడెం గ్రామ సర్పంచ్ శ్రీమతి గుగులోత్ కృష్ణవేణి, వీరబాబు ఈరోజు ఎంపీ రామ సహాయం రఘురామరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సమగ్ర అభివృద్ధికి సంబంధించిన ప్రధాన సమస్యలు, అవసరాలు,ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామానికి అత్యవసరమైన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్యా,ఆరోగ్య రంగాల బలోపేతానికి తగిన నిధులు సహకారం అందించాలని వినతిపత్రం సమర్పించారు. గ్రామ ప్రజల సంక్షేమం దృష్ట్యా వివిధ సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరాన్ని కూడా వివరించారు. అదేవిధంగా, ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి సీఎం రిలీఫ్ ఫండ్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ సేవాభావాన్ని చాటుకున్నట్లు తెలిపారు. ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న నాయకులుగా కృష్ణవేణి, వీరబాబుల సేవలను స్థానికులు అభినందిస్తున్నారు. గుంపెల్లగూడెం గ్రామ అభివృద్ధికి ఈ సమావేశం ఒక ముఖ్యమైన ముందడుగు కావాలని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# 42 కిలోమీటర్ల బై వాక్ (నడక ద్వారా) మారథాన్‌ను విజయవంతంగా పూర్తి



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) ఏప్రిల్ 7 :** హుస్నాబాద్‌కు చెందిన ఆకునూర్ రాజు ( ఎస్ బి ఐ కోహెడ అసిస్టెంట్ మేనేజర్) మరియు సుభాష్ (సెనైట్ డ్రెస్సెస్) ఏప్రిల్ 5వ తేదీ ఆదివారం రోజున హుస్నాబాద్ ఆరేపల్లి నుండి కరీంనగర్ వరకు సుమారు 42 కిలోమీటర్ల బై వాక్ (నడక ద్వారా) మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. వారి ఈ విశిష్ట సాధనకు గుర్తింపుగా హుస్నాబాద్ రన్నర్స్ వారు వారికి చిరు సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలియజేస్తూ, రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అలాగే, వారి కృషిని ఇన్స్పిరేషన్‌గా తీసుకొని ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతిరోజూ ఉదయాన్నే రన్నింగ్ లేదా నడక అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలు శంకర్ సత్యనారాయణ రెడ్డి తిరుపతి సతీష్ , పంతం నవీన్ కుమార్ శ్రీకాంత్ అంజి మరియు నవీన్ పాల్గొన్నారు.

పీపుల్స్ డైరీ
కరీంనగర్
బుధవారం, 8 ఏప్రిల్2026
సంపుటి : 18, సంచిక : 44


# హుస్నాబాద్ పట్టణంలో ప్రజా పాలన



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) ఫిబ్రవరి 7 :** ఈరోజు హుస్నాబాద్ పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘ చైర్ పర్సన్ శ్రీమతి దండి లక్ష్మీ ఆధ్వర్యంలో 14 వ వార్డ్ లో చెత్త విభజన, హోమ్ కంపోస్టింగ్, ప్లాస్టిక్ బ్యాన్ అనే అంశాల పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. చైర్ పర్సన్. మాట్లాడుతూ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ 2026 ప్రకారం చెత్తను 4 రకాలుగా తడి,పొడి, సానిటరీ, హానికరమైన చెత్తగా వేరు చేసి పురపాలక సంఘ వాహనానికి అందించాలని, డ్రైనేజీ లలో చెత్తను వేయకూడదని, సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకూడదని, ప్లాస్టిక్ కి బదులుగా మెప్మా ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంకులను ఏర్పాటు చేయడం జరిగిందని, వార్డు ప్రజలకు తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేసుకునే విధానాన్ని వివరించడం జరిగింది. అనంతరం డ్రైనేజీల వెంబడి స్ప్రే మరియు బ్లీచింగ్ చేయడం లాంటి కార్యక్రమాలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ చిత్తారి పద్మ సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం,పర్యావరణాధికారి రవికుమార్, బసిల్ ఫౌండేషన్ సూపర్వైజర్ నవీన్,వార్డ్ ఆఫీసర్ శేఖర్,శ్రీకాంత్,వార్డ్ ఆర్ పి అరుణ మరియు సిబ్బంది పాల్గొన్నారు

# హత్యాయత్నం కేసులో నిందితునికి జైలు శిక్ష జరిమానా

**భూపాలపల్లి ఏప్రిల్ 7 పీపుల్స్ డైరీ :** భూపాలపల్లి ఘణపురం మండలం చెల్పూరు గ్రామంలో జరిగిన హత్యాయత్నం కేసులో నిందితునికి భూపాలపల్లి అసిస్టెంట్ సెషన్స్ న్యాయమూర్తి నాగరాజు ఐదు సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,500/- జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.చెల్పూరు గ్రామానికి చెందిన బమ్మ బిక్షపతి (50 సంవత్సరాలు), బజ్జీల దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. తేదీ 07.01.2022న అదే గ్రామానికి చెందిన తాళ్ల పెల్లి రాజు మద్యం సేవించి అక్కడికి వచ్చి బిక్షపతిని చాప ముక్కలు ఇవ్వమని అడిగాడు. డబ్బులు ఇవ్వాలని చెప్పడంతో ఆగ్రహించిన నిందితుడు దుర్భాషలాడుతూ, చంపాలనే ఉద్దేశంతో మూకుడులో మసులుతున్న వేడి నూనెను ఫిర్యాదిదారిపై పోశాడు.దీంతో ఫిర్యాదిదారికి కాళ్లపై గాయాలు కాగా, ప్రాణభయంతో అక్కడి నుంచి పారిపోయాడు. అదే రోజు గణపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేయగా, అప్పటి ఎస్‌హెచ్‌ఓ ఉదయ్ కిరణ్, కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచి ఛార్జ్ షీట్ దాఖలు చేశారు.కోర్టు విచారణలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.డి. రఫీక్ గారు వాదనలు వినిపించగా, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ జి. వెంకన్న ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ శ్వేత సాక్షులను ప్రవేశపెట్టారు. విచారణలో నిందితునిపై నేరం రుజువైనందున న్యాయమూర్తి శిక్ష విధించారు.ఈ కేసులో నిందితునికి శిక్ష పడేలా కృషి చేసిన అధికారులను భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ అభినందించారు.

# మృతుని కుటుంబన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



**భూపాలపల్లి ( రేగొండ ) ఏప్రిల్ 7 పీపుల్స్ డైరీ :** రేగొండ :- మృతుని కుటుంబాన్ని ఎమ్మెల్యే జీ ఎస్ ఆర్ పరామర్శించిరు. మంగళవారం మండలంలోని రూపిరెడ్డి పల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందిన మద్ది సదయ్య కుటుంబ సభ్యులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరామర్శించరు.ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.వారి వెంట పి ఏ సి ఎస్ మాజీ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు,ముదుతన పల్లి శంకరయ్య , నాగపూరి శ్రీధర్, మొగిలి, తోట రఘు, ఆలుగం రమేష్, రాజు, ముదుతన పల్లి శంకర్,గ్రామస్తులు ఉ న్నారు.

# బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసిన అన్ని శాఖల అధికారులకు కృతజ్ఞతలు

**ఆలయ చైర్మెన్ ఇంగిలే రామారావు**



**ఇల్లంతకుంట ఏప్రిల్ 7 పీపుల్స్ డైరీ :** శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల సందర్భంగా దాదాపు 13 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రజలకు భక్తులకు సహకరించినటువంటి జమ్మికుంట కాటన్ మిల్లర్స్, పారాబోయిల్డ్ రైస్ మిల్లర్స్, రా రైస్ మిల్లర్స్ అన్నదాన కార్యక్రమం,అన్ని శాఖల అధికారులకు జిల్లా యంత్రాంగానికి,పోలీస్ శాఖ, ఆర్ అండ్ బి, ఆరోగ్యశాఖ,=ుజ యాజమాన్యం, రెవెన్యూ శాఖ 108,మున్సిపాలిటీ అధికారులు, పారిశుద్ధ కార్మికులు, 18గ్రామాల గ్రామపంచాయతీ సిబ్బంది, దేవస్థానం అధికారులు,అర్చకులు, సిబ్బంది, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులందరికి కృతజ్ఞతలు అలాగే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించిన పోలీస్ వారికి వారి కుటుంబానికి ఆ సీతారామచంద్ర స్వామి దేవుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా మా పాలకవర్గం తరపున కోరుకుంటున్నాం. ఈ కార్యక్రమంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మెన్ ఇంగిలే రామారావు ధర్మకర్తలు గోలి కిరణ్, గోడిశాల పరమేష్, కారింగుల రాజేందర్, సింగిరెడ్డి గోపాల్, కురిమిండ్ల చిరంజీవి,ఎడ్ల కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాలనీలు, బస్తీల్లో పెరిగిన దోమల ఉధృతి..ఆందోళనలో ప్రజలు

- దోమల బెడద నుండి కాపాడండి
- అధికారుల పర్యవేక్షణ లోపం డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నా పట్టించుకునేవారు లేరు
- దోమల నివారణకు చర్యలు చేపట్టాలి మేడ్చల్ ప్రజలు





**మేడ్చల్, ఏప్రిల్ 07 (పీపుల్స్ డైరీ) :** మేడ్చల్ డివిజన్ లో రోజురోజుకూ పెరుగుతున్న దోమల బెడద ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోంది. పట్టణంలోని పలు కాలనీలు, బస్తీలు, లోతట్టు ప్రాంతాలు, డ్రైనేజీలు, చెత్త పేరుకుపోయిన ప్రదేశాల్లో దోమలు విపరీతంగా పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సాయంత్రం సమయం నుంచి రాత్రివేళల వరకు దోమల ఉధృతి ఎక్కువగా ఉండటంతో చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. ప్రస్తుతం ఎండాకాలం ప్రారంభమైనప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ ఉండటం, డ్రైనేజీలు సక్రమంగా శు భ్రం చేయకపోవడం, ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోవడం, కాలనీల్లో నీరు నిలిచిపోవడం వంటి కారణాలతో దోమలు విపరీతంగా వ్యాపిస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొన్ని కాలనీల్లో రోజులు గడుస్తున్నా ఫాగింగ్ సక్రమంగా జరగడం లేదని, బ్లీచింగ్ చల్లింపు కూడా కనిపించడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దోమల కారణంగా డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొందరు జ్వరాలు, అలర్జీలు, దురదలు వంటి సమస్యలతో బాధపడుతున్నారని చెబుతున్నారు. రాత్రివేళల్లో దోమల నుండి రక్షణ కోసం కాయిల్స్, లిక్విడ్స్, దోమతెరలు వాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని, సాధారణ కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో మేడ్చల్ మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి పట్టణంలోని అన్ని కాలనీలు, బస్తీలు, డ్రైనేజీలు, మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా ఫాగింగ్, యాంటీ లార్వా స్ప్రేయింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లింపు, డ్రైనేజీల శుభ్రపరిచే పనులు, చెత్త తొలగింపు వంటి చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కోరుతున్నారు. అదేవిధంగా, ప్రతి వార్డు వారీగా దోమల నివారణ చర్యలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా మేల్కొని దోమల బెడదపై ప్రత్యేక దృష్టి సారించాలని, లేదంటే వ్యాధులు విస్తరించే ప్రమాదం ఉందని ప్రజలు హెచ్చరిస్తున్నారు.మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో దోమల బెడద అధికమవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలు, బస్తీలు, డ్రైనేజీలు, నిల్వ నీటి ప్రాంతాల్లో దోమలు విపరీతంగా పెరగడంతో రాత్రివేళలు నిద్రపోవడమే కష్టంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాల భయం వెంటాడుతుండటంతో అధికారులు వెంటనే ఫాగింగ్, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆర్టీఐ ఉమెన్ రైట్స్ తెలంగాణ అధ్యక్షుడు రమేష్ గుప్తా అన్నారు

# మెడిసిటీ కళాశాల మెడికల్ సైన్సెస్‌లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ కార్యక్రమాలు

- ఆరోగ్యం కోసం అందరం సైన్స్‌కు తోడుగా" అనే థీమ్‌తో అవగాహన కార్యక్రమాలు



**మేడ్చల్, ఏప్రిల్ 7 (పీపుల్స్ డైరీ) :** ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఏప్రిల్ 7న నిర్వహించే ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా, ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని ఘనపూర్ లో గల మెడిసిటీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్లో పలు అవగాహన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం రంగోళి, క్విజ్, డిజిటల్ పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించారు. అనంతరం మిమ్స్ ఆవరణంలోని ఆడిటోరియంలో, ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య దినోత్సవ థీమ్ అయిన "ఆరోగ్యం కోసం అందరం -- సైన్స్‌కు తోడుగా" అంశంపై ప్రత్యేక ఉపన్యాసాలు నిర్వహించారు. ఈ ఉపన్యాసాలలో డా. అంకుష్ పవార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, కమ్యూనిటీ మెడిసిన్ మాట్లాడుతూ, వైద్య రంగంలో శాస్త్రీయ ఆధారాలు పరిశోధనలు, అంతర్జాతీయ సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. అలాగే మానవ, జంతు మరియు పర్యావరణ ఆరోగ్య పరిరక్షణకు "వన్ హెల్త్" విధానం అవసరమని వివరిస్తూ, దాని ప్రాముఖ్యతపై చర్చించారు. అదే విధంగా డా. హేమలత, అసిస్టెంట్ ప్రొఫెసర్, కమ్యూనిటీ మెడిసిన్ మాట్లాడుతూ, ప్రస్తుతం విస్తృతంగా అందుబాటులో ఉన్న డిజిటల్ మీడియా ద్వారా ఆరోగ్య సంబంధిత అంశాలను సమాజంలో ఎలా విస్తృతంగా ప్రచారం చేయవచ్చో ప్రత్యేక ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడిన మిమ్స్ వైస్ ప్రిన్సిపాల్ డా. శైలేంద్ర, కేవలం మానవ ఆరోగ్య పరిరక్షణతోనే సరిపోదని, పర్యావరణం మరియు జంతుజాలాన్ని కలుపుకుని ఆరోగ్యాన్ని చూడాల్సిన అవసరాన్ని కోవిడ్ మహమ్మారి ప్రపంచానికి స్పష్టంగా తెలియజేసిందని అన్నారు. జంతువుల నుంచి మానవులకు వ్యాధులు వ్యాపించే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, "వన్ హెల్త్" విధానాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహిస్తున్నారని, అందరూ ఈ దిశగా ఆలోచించాలని సూచించారు.కార్యక్రమం ముగింపులో, రంగోళి పోటీలో ప్రథమ బహుమతి సాధించిన శిరిచందన మరియు బృందానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. దేవేంద్ర సింగ్ నేగి, అలాగే డిజిటల్ పోస్టర్ తయారీ పోటీలో విజేత హర్ష పండిత్‌కు వైస్ ప్రిన్సిపాల్ డా. శైలేంద్ర బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాలను డా. లియోవాజ్, ప్రొఫెసర్ మరియు విభాగాధిపతి, కమ్యూనిటీ మెడిసిన్, అలాగే డా. ఈనాక్షి, ప్రొఫెసర్, కమ్యూనిటీ మెడిసిన్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డా. దేవేంద్ర సింగ్ నేగి ప్రిన్సిపాల్, డా. శైలేంద్ర వైస్ ప్రిన్సిపాల్, డా. కల్పనప్రొఫెసర్ ఢ హెడ్, గైనకాలజీ, డా. లియోవాజ్ ప్రొఫెసర్ ఢ హెడ్, కమ్యూనిటీ మెడిసిన్, డా. ఈనాక్షి ప్రొఫెసర్, డా. పవన్ కుమార్ శర్మ ప్రొఫెసర్, డా. అంకుష్ పవార్, డా. హేమలత అసిస్టెంట్ ప్రొఫెసర్లు, కమ్యూనిటీ మెడిసిన్ లతో పాటు పలువురు వైద్య, నర్సింగ్, పారా మెడికల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- మధ్యాహ్న పాఠశాలల మార్గదర్శకాలు ఉల్లంఘనపై ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాలు ఆందోళన
- ఎంఈఓ కార్యాలయంలో వినతి పత్రం





**మేడ్చల్, ఏప్రిల్ 7: (పీపుల్స్ డైరీ) :** మేడ్చల్ మండలంలోని పాఠశాలలు ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోకుండా మధ్యాహ్న పాఠశాలల విధానాన్ని ఉల్లంఘిస్తూ పూర్తి రోజు తరగతులు నిర్వహిస్తున్నాయనే ఆరోపణలపై ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మండల కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా హైటెక్ వాలీ స్కూల్ ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించకుండా విద్యార్థులతో పూర్తి సమయ పాఠశాల నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ నాయకులు పేర్కొన్నారు. వేసవి తీవ్రత రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో, చిన్నారుల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం మధ్యాహ్నం పాఠశాలలను అమలు చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, కొన్ని ప్రైవేట్ పాఠశాలలు వాటిని పూర్తిగా విస్మరిస్తున్నాయని వారు ఆరోపించారు. తీవ్ర ఎండల సమయంలో పూర్తి రోజు తరగతులు నిర్వహించడం వల్ల విద్యార్థులు శారీరకంగా, మానసికం గా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా చిన్నపిల్లలు అలసట, ఒత్తిడి, డీహైడ్రేషన్ వంటి ఆరోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. అదేవిధంగా, ప్రస్తుత విద్యా సంవత్సరం పూర్తికాకముందే తదుపరి విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభించడం, అదనపు ఫీజులు వసూలు చేయడం వంటి చర్యలు కూడా తీవ్రంగా ఖండించారు. ఈ విధానాలు విద్యార్థులు, తల్లిదండ్రులపై అనవసరమైన ఆర్థిక భారం మోపుతున్నాయని, విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చే ప్రమాదకర ధోరణికి ఇది నిదర్శనమని ఎస్ఎఫ్ఐ నాయకులు విమర్శించారు. ఈ నేపథ్యంలో ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మండల కమిటీ నాయకులు ఎంఈఓ కార్యాలయం సిబ్బందికి వినతి పత్రం సమర్పించి, మండలంలోని పాఠశాలలపై వెంటనే ప్రత్యేక తనిఖీలు చేపట్టి, ప్రభుత్వ మధ్యాహ్న పాఠశాలల మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అదనపు ఫీజులు వసూలు చేస్తున్న యాజమా న్యాలపై కూడా చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, హక్కుల పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మండల నాయకులు వినయ్, రాజశేఖర్, కార్తిక్, నేహాల్ పాల్గొన్నారు.

# ముల్కనూర్ శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థాన విగ్రహ ప్రతిష్టాపన



**భీమదేవరపల్లి ఏప్రిల్ 07 (పీపుల్స్ డైరీ ) :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలో అత్యంత వైభవంగా నిర్మితమవుతున్న శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థాన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో భాగంగా భక్తులు తమ భక్తి చాటుకుంటూ భారీగా విరాళాలు,ఆభరణాలను అందజేస్తున్నారు.ఆలయ నిర్మాణ కమిటీ, యాదవ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో పలువురు దాతలు దేవతా మూర్తులకు అవసరమైన అలంకరణ వస్తువులను సమర్పించారు. ఆలయ ప్రతిష్టాపనలో భాగంగా శ్రీమతి శ్రీ జక్కుల సరోజన - మొగిలి దంపతులు కేతమ్మ దేవతకు పవిత్రమైన పుస్తెలు, మట్టెలను అందజేశారు. శ్రీమతి శ్రీ గిరబోయిన స్వరూప - కుమారస్వామి దంపతులు మేడాలమ్మ దేవతకు పుస్తెలు,మట్టెలను కానుకగా సమర్పించారు. శ్రీమతి,శ్రీ జక్కుల యాదమ్మ - ప్రకాశం దంపతులు శ్రీకృష్ణుని విగ్రహ ఏర్పాటు కోసం ₹50,116/- నగదును విరాళంగా అందజేశారు. శ్రీ మల్లికార్జున స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన కిరీటాన్ని శ్రీమతి,శ్రీ దొండ రాణి - మల్లయ్య దంపతులు బహూకరించారు.ఈ సందర్భంగా యాదవ సంఘ కుల పెద్దలు మాట్లాడుతూ.. స్వామి వారి ఆలయ నిర్మాణంలో భాగస్వాములై, దేవతా మూర్తులకు పుస్తెలు, మట్టెలు,విరాళాలు అందించిన దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. భక్తుల సహకారం వల్లే ఈ పుణ్యకార్యం దిగ్విజయంగా సాగుతోందని,వారి కుటుంబాలకు ఆ మల్లికార్జున స్వామి ఆశీస్సులు మెండుగా ఉండాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,యాదవ సంఘం ప్రతినిధులు,గ్రామ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలకు సేవలందించిన బల్మూర్ వెంకట్‌కు దేవస్థానం సత్కారం



**ఇల్లందకుంట, ఏప్రిల్ 7 ( పీపుల్స్ డైరీ ) :** అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతున్న వేళ, స్వామివారి సేవలో భాగస్వామ్యులైన దాతలను దేవస్థానం ప్రత్యేకంగా సత్కరిస్తోంది. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు పట్టు వస్త్రాలను సమర్పించి, తన అనుచరులతో కలిసి తలంబ్రాలు పంపించిన డాక్టర్ బల్మూర్ వెంకట్‌ను ఆలయ అధికారులు ఘనంగా సన్మానించారు. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన కళ్యాణోత్సవం, రథోత్సవం వంటి కార్యక్రమాలకు అవసరమైన పట్టు వస్త్రాలను సమకూర్చిన బల్మూర్ వెంకట్ సేవలను అర్చకులు, అధికారులు ప్రత్యేకంగా కొనియాడారు. అలాగే ఆయన అనుచరులు సమర్పించిన తలంబ్రాలు ఉత్సవాలకు మరింత శోభను తీసుకొచ్చాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో తలంబ్రాల సమర్పణకు గాను దేవస్థానం తరఫున గుర్తింపుగా మెమెంటోను అందజేశారు. ఆలయ అర్చకులు స్వామివారి ఆశీర్వాదాలతో డాక్టర్ బల్మూర్ వెంకట్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం హైదరాబా ద్‌లోని ఆయన నివాసంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో చింతల శ్యామ్ సుందర్ రెడ్డి బాబాజీ నాగరాజు, సింగిరెడ్డి రంజిత్ రెడ్డి, , అనిల్ రెడ్డి, కిషోర్ తదితరులు కలిసి స్వామివారి మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ, ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్రస్వామి సేవలో భాగస్వామ్యం కావడం తనకు గొప్ప అదృష్టమని అన్నారు. భవిష్యత్తులో కూడా దేవస్థానం కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. దేవస్థానం అధికారులు మాట్లాడుతూ, భక్తుల సహకారంతోనే బ్రహ్మోత్సవాలు మరింత వైభవంగా నిర్వహించగలుగుతున్నామని, సేవాభావంతో ముందుకు వస్తున్న దాతలను ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు

# రవీంద్రభారతిలో డబిల్‌పురం పరశురాంకు 'దళితరత్న' అవార్డు

- 18 ఏళ్ల అకుంఠిత దీక్షకు లభించిన గుర్తింపు
- జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ సుదర్శన్ బాబు, ఎన్.వై. అశోక్, తిప్పారపు లక్ష్మణ్ ల సమక్షంలో అవార్డు అందుకున్న పరశురాం
- ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ఆయన చూపిన చొరవకు ఈ అవార్డు ఒక మకుటం




**మేడ్చల్, ఏప్రిల్ 07 (పీపుల్స్ డైరీ) :-** అణగారిన వర్గాల ఆశాజ్యోతి, బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికగా జిహెచ్ఎంసి పరిధిలోని మేడ్చల్ సర్కిల్ కార్యాలయం పరిధిలో గల కిష్టాపూర్ గ్రామానికి చెందిన డబిల్‌పురం పరశురాం ప్రతిష్ఠాత్మకమైన 'దళితరత్న' అవార్డును అందుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం, మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ఈ ప్రదానోత్సవం అత్యంత వైభవంగా జరిగింది.

**18 ఏళ్ల అకుంఠిత దీక్షకు లభించిన గుర్తింపు :**

గత 18 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అడుగుజాడల్లో నడుస్తూ, ఏ రాజకీయ పార్టీ కండువా కప్పుకోకుండా జాతి ప్రయోజనాలే లక్ష్యంగా పని చేస్తున్న మేడ్చల్ జిల్లా యువసేన అధ్యక్షుడు డబిల్‌పురం పరశురాంకు దళితరత్న పురస్కారం లభించింది. గతంలో గ్రామ ఉపాధ్యక్షుడిగా, మేడ్చల్ మండల యువసేన అధ్యక్షుడిగా, మేడ్చల్ మండల అధ్యక్షుడిగా 8 ఏళ్ల పాటు విశేష సేవలు అందించిన పరశురాం, ప్రస్తుతం జిల్లా యువసేన అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ఆయన చూపిన చొరవకు ఈ అవార్డు ఒక మకుటంగా నిలిచింది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ సుదర్శన్ బాబు, ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షులు ఎన్.వై. అశోక్, ఎంఆర్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు మరియు మేడ్చల్ జిల్లా ఇన్చార్జ్ తిప్పారపు లక్ష్మణ్ సమక్షంలో ఈ అవార్డును అందుకున్నారు. అనంతరం డబిల్‌పురం పరశురాం మాట్లాడుతూ సమాజ సేవలో, ముఖ్యంగా అణగారిన వర్గాల హక్కుల పోరాటంలో అలుపెరగని కృషి చేసినందుకు గాను తమకు ఈ గౌరవం దక్కడం పట్ల అవార్డు గ్రహీతలు సంతోషం వ్యక్తం చేశారు.

# డంప్ యార్డ్ తరలింపునకు కృషి చేయాలని కోరిన నాయకులు

- ప్రణవ్ ఆధ్వర్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను కలిసిన డంప్ యార్డ్ జేఏసీ నాయకులు,మున్సిపల్ పాలకవర్గం..
- ఇప్పటికే ప్రణవ్ ద్వారా తన దృష్టికి వచ్చిందని వెల్లడి.
- సానుకూలంగా స్పందించిన జిల్లా ఇంచార్జి మంత్రి.



**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 07 (పీపుల్స్ డైరీ) :** వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ద్వారా హుజురాబాద్ ప్రాంతం తీవ్రంగా నష్టపోతుందని,ప్రజల ఆరోగ్యమే కాకుండా సారవంతమైన నేల కలిగిన హుజూరాబాద్,సిర్సపల్లి ప్రాంతం కాలుష్య కోరల్లో చిక్కుకుంటదని హుజూరాబాద్ డంప్ యార్డ్ జేఏసీ నాయకులు,హుజూరాబాద్ మున్సిపల్ పాలకవర్గం అన్నారు. మంగళవారం రోజున సెక్రటేరియట్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చాంబర్ లో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు,పాలకవర్గం,మున్సిపల్ పరిధిలోని నాయకులతో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై ఇప్పటికే మున్సిపల్ పాలకవర్గం ఈ డంప్ యార్డును వ్యతిరేకిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారని ఆ విషయాన్ని మంత్రికి వివరించారు. వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ వేరే చోటుకు తరలించాలని, ఈ ప్రాంత భవిష్యత్ దృష్టిలో ఉంచుకొని సానుకూల ప్రకటన చేయాలని జేఏసి నాయకులు కోరగా సానుకూలంగా స్పందించిన మంత్రి ఇప్పటికే ఈ విషయంపై ప్రణవ్ నా దృష్టికి తీసుకువచ్చాడని తప్పకుండా ముఖ్యమంత్రితో మాట్లాడి కృషిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,జేఏసీ నాయకులు, కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు,మున్సిపల్ పరిధి నాయకులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డు వ్యతిరేక దీక్షలపై పోలీసుల ఉక్కుపాదం



**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 07 (పీపుల్స్ డైరీ ) :** డంపింగ్ యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా హుజురాబాదులో సాగుతున్న ప్రజా పోరాటాన్ని అనిచివేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు ఉద్రిక్తతకు దారితీసాయి. అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు పదిహేనవ రోజుకి చేరుకున్న తరుణంలో మంగళవారం పోలీసులు వ్యవహరించిన తీరు స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. మంగళవారం ఉదయం నుంచే దీక్ష శిబిరం వద్ద పోలీసులు బారిగా మోహరించారు. నిరసన కారులు వేసుకున్న టెంట్లకు కొన్నింటిని అనుమ తించారు. కొన్ని వేయకుండా పోలీసులు బలవంతంగా తొలగిం చడమే కాకుండా కొత్తగా టెంట్లు వేయకుండా అడ్డుకు న్నారు. దీనితో చేసే దేమీ లేక నాయకులు కార్యకర్తలు మండుతున్న ఎండలోనే చెట్ల కింద రోడ్లపై నిలబడి తమ నిరసనను కొనసాగించారు. ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాస్తున్నారని నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉద్యమాన్ని నీరుకార్చేందుకు పోలీసులు గ్రామాల స్థాయి నుంచే ఒత్తిడి పెంచుతున్నారు. ఎంఎల్ఏ కౌశిక్ రెడ్డి పిలుపునిచ్చిన సభకు రావద్దని, ఒకవేళ వెళ్తే కేసులు నమోదు చేస్తామని, పలు గ్రామాల సర్పంచులకు, కీలక నాయకులకు పోలీసులు ముందస్తు ఫోన్లలో హెచ్చరించడం కలకలం రేపుతోంది. ప్రభుత్వ ఆదేశాల తోనే పోలీసులు ఇలా అతిగా ప్రవర్తిస్తున్నారని నిరసనకారులు మండిపడుతున్నారు. దీక్ష శివరానికి చేరుకున్న ఎంఎల్ఏ పాడి కౌశిక్ రెడ్డి పోలీసుల తీరుపై తీవ్రంగా స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా మీద కోపంతో ఈ ప్రజా ఉద్యమాన్ని భగ్నం చేయకండి. ఇది నా వ్యక్తిగత పోరాటం కాదు. హుజురాబాద్ ప్రజల భవిష్యత్తు కోసం చేస్తున్న యుద్ధం. వరంగల్, కరీంనగర్ జిల్లాల చెత్తను ఇక్కడికి తెస్తే స్థానికులు రోగాల బారిన పడరా ? అని ప్రశ్నించారు. ఈ డంపింగ్ యార్డు వల్ల హుజురాబాద్ తో పాటు సైదాపూర్, శంకరపట్నం, జమ్మికుంట, ఇల్లంతకుంట, ఎలకతుర్తి కమలాపూర్ మండలాలకు తీరని నష్టం జరుగుతుందని ఎంఎల్ఏ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పోరాటంలో ఎంపీ ఈటెల రాజేందర్, కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా కలిసి రావాలని ప్రజల కోసం అందరూ ఏకంగా కావాలని పిలుపునిచ్చారు. డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలంటే కౌశిక్ రెడ్డి శవం మీద నుంచే వెళ్ళాలి, అంటూ ఎమ్మెల్యే తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. పోలీసులు ఎన్నో ఆంక్షలు విధించినా, టెంట్లు పీకేసినా డంపింగ్ యార్డు జీవోను రద్దు చేసే వరకు ఉద్యమం ఆగేది లేదని కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. హుజూరాబాద్ ఉద్యమాల గడ్డని ఇక్కడ అణిచివేత సాగదని ఆయన తేల్చి చెప్పారు.

# డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నిరాహార దీక్ష

**హుజురాబాద్ టౌన్ ఏప్రిల్ 07 ( పీపుల్స్ డైరీ ) :** హుజురాబాద్ లో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా కొనసాగుతున్న ప్రజా ఉద్యమం మరింత ఉధృతమైంది. ఈరోజు నిర్వహించిన ఇరువై నాలుగు గంటల నిరాహార దీక్షలో భాగంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అమరవీరులను స్మరించుకుని నిరాహార దీక్షలో కూర్చున్నారు. ప్రజల ఆరోగ్యం, భవిష్యత్తు, పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టిన ఈ నిరసనకు విశేష స్పందన లభించింది. పెద్దఎత్తున మహిళలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దీక్షలో పాల్గొన్నారు. వివిధ గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన ప్రజలు, యువత, మహిళలు దీక్ష స్థలాన్ని నింపివేసి ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వినోద్ కుమార్ జేఏసీ కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడటమే కాకుండా భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని నాయకులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఎమ్ఎల్ఏ పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయడం ప్రజలపై అన్యాయం అని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలో పడేసే ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ప్రజల తరఫున చివరి వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు. ప్రజల ఐక్యతతో ఈ ఉద్యమం విజయవంతం అవుతుందని ప్రభుత్వం వెంటనే స్పందించి డంపింగ్ యార్డ్ ఏర్పాటు నిర్ణయాన్ని రద్దు చేయాలని జేఏసీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున మహిళలు, ప్రజలు, ప్రజాప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.



# జీవి రామకృష్ణారావు ఘనంగా పుట్టినరోజు వేడుకలు



**శంకరపట్నం ఏప్రిల్:07 పీపుల్స్ డైరీ :** శంకరపట్నం : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బి ఆర్ ఎస్ శ్రేణులు మాజీ సుడా చైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం శంకరపట్నం బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంట మహిపాల్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా గంట మహిపాల్ మాట్లాడుతూ, జీవి రామకృష్ణారావు ప్రజా సేవలు మరువ లేనివని, పార్టీ అభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, మరిన్ని సేవలు చేయాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

**రైతులకు అవగాహనతో కార్యక్రమం**



**శంకరపట్నం ఏప్రిల్:07 పీపుల్స్ డైరీ :** మండల కేంద్రం లో ని కేశవపట్నం గ్రామం లో పశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం సర్పంచ్ గోదారి రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో 185 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు అన్నారపు సరోజన తిరుపతి, రైతులు పాల్గొన్నారు. డాక్టర్ మాధవరావు నేతృత్వంలో సందీప్, అమర్, సాయికిరణ్, అజహార్ సిబ్బంది, గోపాలమిత్రలు శ్రీనివాస్, సంపత్ టీకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రైతులకు సూచిస్తూ, పశువులను వ్యాధుల నుంచి రక్షించేందుకు సమయానికి టీకాలు వేయించడం అవసరమని తెలిపారు. పాకలను పరిశుభ్రంగా ఉంచడం, అనారోగ్య లక్షణాలు గమనిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం ద్వారా గాలికుంటు వ్యాధిని నియంత్రించవచ్చని పేర్కొన్నారు.

# ఉపాధిహామీ కూలీలకు ఆరోగ్యపరమైన సూచనలు



**కోహెడ ఏప్రిల్ 7 (పీపుల్స్ డైరీ) :** కోహెడ మండలం గుండారెడ్డిపల్లి లో సర్పంచ్ పిల్లిబాబు, పాలకవర్గం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఎన్ఆర్ఈజీఎస్ మేట్ గుడిపాక శంకర్, ఏఎన్ఎం నీరజ, ఆశవర్కర్స్ గుడిపాక రేణుక, గుజ్జు జ్యోత్స్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు వేసవి కాలం ను దృష్టిలో ఉంచుకొని పని జరుగుతున్న ప్రదేశం కి వెళ్లి కూలీలకు గ్లూకోస్ పౌడర్, కాల్షియం టాబ్లెట్స్, బి కాంప్లెక్స్, విటమిన్ టాబ్లెట్స్ పంపిణీ చెయ్యడం జరిగింది. కూలీలకు అందుబాటులో వాటర్ అందించడం తో పాటు ఆరోగ్యపరమై నటువంటి జాగ్రత్తలు సూచించారు.

# చలివేంద్రం ప్రారంభించిన గ్రామ ఉప సర్పంచ్ రాపర్తి సంధ్య




**వీణవంక ఏప్రిల్ 08( పీపుల్స్ డైరీ) :** మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఎండ తీవ్రతలో భాగంగా బాలవికాస ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన పబ్బు సులోచన దీనికి ముఖ్యఅతిథిగా హాజరై చలివేంద్రాన్ని పోతిరెడ్డిపల్లి గ్రామ ఉపసర్పంచ్ రాపర్తి సంధ్య ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ. ఈ వేసవికాలంలో వాహనదారులు కానీ గ్రామ ప్రజలు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వలన వచ్చే పోయే వాహనాలు చలివేంద్రాన్ని చదివినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పోతిరెడ్డిపల్లి గ్రామ కార్యదర్శి సుష్మ వాటర్ ప్రొన్సర్ చేసిన వారు పానుగంటి సులోచన సమ్మయ్య బాలవికాస సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పీపుల్స్‌డైరీ
కరీంనగర్
బుధవారం, 8 ఏప్రిల్2026
సంపుటి : 18, సంచిక : 44


## అమ్మనగుర్తి గుండ్లపల్లి లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



**సైదాపూర్ ఏప్రిల్ 7 ( పీపుల్స్ డైరీ ) :** సైదాపూర్ మండలము అమ్మనగుర్తి గుండ్లపల్లి గ్రామం లో పశువుల ఆరోగ్య పరిరక్షణ కోసం సర్పంచ్ కదిరి రమేష్ కంది తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో 274 పశువులకు జాతీయ గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు. డాక్టర్ మాధవరావు నేతృత్వంలో సిబ్బంది, లాలు మహేష్ సమ్మిరెడ్డి గోపాలమిత్రలు తాళ్ల పెల్లి మొగిలి పోతరాజు శ్రీనివాస్ గోనెల శ్రీనివాస్ గొర్రె శ్రీనివాస్ శ్రీనివాస్, టీకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కదిరే రమేష్ మాట్లాడుతూ అధికారులు రైతులకు సూచిస్తూ, పశువులను వ్యాధుల నుంచి రక్షించేందుకు సమయానికి టీకాలు వేయించడం అవసరమని తెలిపారు. పాకలను పరిశుభ్రంగా ఉంచడం, అనారోగ్య లక్షణాలు గమనిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం ద్వారా గాలికుంటు వ్యాధిని నియంత్రించవచ్చని పేర్కొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ కు వినతి పత్రం అందచేసిన సగర సంఘం రాష్ట్ర నాయకులు

### కలెక్టర్ కు సిపార్సు చేసిన పొన్నం ప్రభాకర్



**వీణవంక 8( పీపుల్స్ డైరీ ) :** కరీంనగర్ జిల్లా కేంద్రంలో సగరుల కోసం భూమి కేటాయించాలని కోరుతూ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర, జిల్లా అధ్యక్షుడు దేవునూరి శ్రీనివాసు సగర కోరారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్‌కు వారు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సగరుల సమస్యలు, వారి అభివృద్ధికి తీసుకోవాల్సిన విషయాలపై మంత్రితో చర్చించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ కరీంనగర్ కలెక్టర్‌కు సిఫార్సు చేశారు. అనంతరం పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ సగరుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ప్రజా సమస్యలపై ఫోకస్..

### ఎల్లంపేటలో చైర్‌పర్సన్ శ్రీదేవి క్షేత్రస్థాయి పర్యటన



**మేడ్చల్ ఏప్రిల్ 07 (పీపుల్స్ డైరీ) :** ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని డబిల్‌పూర్ ప్రాంతం లోని పలు వార్డుల్లో మున్సి పల్ అధికారులు, ప్రజాప్రతి నిధులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. స్థానికంగా ఉన్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశ్యంగా సాగింది. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి, వైస్ చైర్మన్ రజిత దేవేందర్ రెడ్డి, కమిషనర్ స్వామి నాయక్, సంబంధిత వార్డ్ కౌన్సిలర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా పలు వార్డుల్లో డ్రైనేజ్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, త్రాగునీటి సరఫరాలో ఇబ్బందులు, అలాగే ఇతర మౌలిక వసతుల సమస్యలు చైర్‌పర్సన్ శ్రీదేవి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించిన చైర్‌పర్సన్ అధికారులతో చర్చించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. వార్డుల పర్యటనలో తెలుసుకున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అదేవిధంగా మున్సిపల్ అధికారులు ప్రజల సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, చేపట్టే పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు

## నాలను కబ్జాల నుంచి విముక్తి చేయాలి

### బంగారు నర్సింగరావు సిపిఎం కీసర మండల కార్యదర్శి



**మేడ్చల్ కీసర ఏప్రిల్ 07 (పీపుల్స్ డైరీ) :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ (వీవీజ) పరిధిలోని కీసర సర్కిల్-01, దమ్మాయిగూడ డివిజన్-04లో బండ్లగూడ రాజీవ్ గృహకల్ప ప్రధాన రహదారి మధ్యలో ఉన్న నాలాను సిపిఎం కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కబ్జాదారులు నాలాను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో నాలా కుదించుకుపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే మున్సిపల్ అధికారులు, సివరేజ్ విభాగం ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని నాలాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నాలాలో చెత్త పేరుకుపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి దుర్వాసన వెదజల్లుతున్నదని, గుడి మరియు పాఠశాలలకు సమీపంలో ఉండటంతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. కాబట్టి నాలాను తరచుగా శుభ్రపరచి, ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా నాలాపై స్లాబ్ నిర్మాణం చేసి రహదారిని అభివృద్ధి చేయాలని, ప్రమాదాలు నివారించేందుకు మలుపు వద్ద తగిన చర్యలు తీసుకోవాలని, రహదారిపై కల్వర్టు ఏర్పాటు చేసి రవాణా సౌకర్యం మెరుగుపరచాలని సూచించారు. నాలను పరిరక్షించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, లేకపోతే ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా బాట



**హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) ఏప్రిల్ 7 :** హుస్నాబాద్ కేంద్రంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజా బాట కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ శాఖ ఏఈ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పట్టణంలోని ట్రాన్స్ ఫార్మర్లకు మరమ్మతులు చేయడం, విద్యుత్ తీగలను సరిచేయడం, ట్రాన్స్ ఫార్మర్ల చుట్టుపక్కల పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేసే పనులను నిర్వహించినట్లు తెలిపారు.

# దళిత రత్న అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం



**మేడ్చల్, ఏప్రిల్ 7 (పీపుల్స్ డైరీ) :** డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా మేడ్చల్ మండల్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఎర్ర విజయరావు ఆధ్వర్యంలో దళిత రత్న అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం నిర్వహించారు. సమాజంలో సేవా భావంతో, దళితుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న వ్యక్తులను గౌరవించడం ఎంతో గర్వకారణమని నాయకులు పేర్కొన్నా రు. హైదరా బాద్‌లోని రవీంద్ర భారతి వేదికగా మహనీయులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ & బాబు జగ్జీవన్ రామ్ ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ప్రదానం చేసిన "దళిత రత్న" అవార్డు అందుకున్న జీడిపల్లి శివకుమార్, జీడిపల్లి రామకృష్ణ, ఎర్ర బాలకృష్ణలను ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవితాంతం అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీ యుడని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. దళితుల సామాజిక, విద్యా, ఆర్థిక పురోగతికి కృషి చేస్తున్న వారిని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సమాజంలో మరింత సేవా స్ఫూర్తి పెరుగుతుందని పేర్కొన్నారు. అలాగే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మరియు బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను యువతలోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని, సమానత్వ సమాజ నిర్మాణానికి అందరూ కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. దళిత సమాజ అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న నాయకులను, కార్యకర్తలను ఈ తరహా సన్మానాలు మరింత ఉత్సాహపరుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రవల్లి బాల నరసింహ, సింగనగూడం బిక్షపతి, నల్లవల్లి శ్రీనివాస్, ల్యాబ్ శంకర్ తదితరులు పాల్గొని అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలిపారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఎఫ్ ఎల్ ఎన్ శాంపుల్ సర్వే సర్టిఫికెట్ల అందజేత



**ఏటూరు నాగారం ఏప్రిల్ 7 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంగళవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో " ఎఫ్ ఎల్ ఎన్ షాంపిల్ సర్వే సర్టిఫికెట్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రేణుక ప్రారంభించి మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ వారు ఈ సర్వేకు మా విద్యార్థులను ఎంచుకున్నందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. గత ఫిబ్రవరి 25, 26, 27వ తేదీలలో 53 మంది డిగ్రీ కళాశాల విద్యార్థులు ములుగు జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ పాఠశాలలకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా వెళ్లి ఎస్సీఈఆర్టీ మరియు జిల్లా విద్యాశాఖ వారు చేపట్టిన సర్వేను అనుసరించి ప్రాథమిక స్థాయిలోని విద్యార్థులలో ఆంగ్లభాష ఉచ్చారణ మరియు రాత నైపుణ్యాలను పరిశీలించి రిపోర్టు విద్యాశాఖ వారికి అందజేయడం జరిగింది. దానికిగాను విద్యార్థులు అందరినీ ప్రశంసిస్తూ ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్న ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ ( విద్యార్థులు )కు ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. సిద్ధార్థ రెడ్డి గారు మరియు జిల్లా విద్యాశాఖ అకాడమిక్ క్వాలిటీ కోఆర్డినేటర్ శ్యామ్ సుందర్ రెడ్డి గారి చేతులమీదుగా ప్రశంస పత్రాలను ( సర్టిఫికెట్స్ ) ను అందజేసి ప్రశంసించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి గారు మాట్లాడుతూ ఎస్సీఈఆర్టీ వారు చేపట్టిన ఈ సర్వేలో పాల్గొని ప్రాథమిక స్థాయిలోని విద్యార్థుల విద్యా వ్యవస్థ పురోభివృద్ధికి పాటుపడినందుకు విద్యార్థులు అందరినీ ప్రత్యేకంగా ప్రశంసించడం జరిగింది. అలాగే సహకరించిన కళాశాల ప్రిన్సిపల్ మరియు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ను అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సిహెచ్ వెంకటయ్య, అధ్యాపకులు నవీన్,జ్యోతి,ఫాతిమా, రమేష్, భాస్కర్, సంపత్,రాజశేఖర్, జీవవేణి,శ్రీధర్ తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జవహార్ నగర్ పిల్లల భవిష్యత్తుపై ప్రత్యేక దృష్టి -సమన్వయంతో కార్యాచరణకు ఆదేశాలు

### జిల్లా కలెక్టర్ మను చౌదరి




**మేడ్చల్ కీసర ఏప్రిల్ 07 (పీపుల్స్ డైరీ) :** జవహార్ నగర్‌లోని 0-18 సంవత్సరాల పిల్లలకు మెరుగైన భవిష్యత్తు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన ప్రణాళిక రూపొందించి ముందుకు సాగాలని తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ సీత దయాకర్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పిల్లలకు విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలు అందించడం మాత్రమే కాకుండా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని సూచించారు. జవహార్ నగర్‌లోని సమస్యలను గుర్తించి, ప్రణాళికాబద్ధంగా దశలవారీగా పరిష్కరించాలని తెలిపారు. స్కూలుకు వెళ్లని, చదువు మానేసిన పిల్లల వివరాలు సేకరించాలని, ఆరోగ్య శిబిరాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. ఆధార్, జనన, కుల ధృవపత్రాలు లేని పిల్లలకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. బాల కార్మికులు, బాల్య వివాహాలు, లైంగిక దాడులు, డ్రాపౌట్ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. లేబర్ డిపార్ట్‌మెంట్ బాల కార్మికులను గుర్తించి చర్యలు తీసుకోవాలని, "ఆపరేషన్ ముస్కాన్" తరహాలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ, అన్ని శాఖలు, ఎన్జీఓల సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పిల్లలను ప్రమాదకర వాతావరణం నుండి బయటకు తీసుకురావాలని అన్నారు. అంగన్‌వాడీల ద్వారా జరుగుతున్న ఫ్యామిలీ సర్వే డేటాను వినియోగించి వారి సామాజిక-ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచాలని సూచించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, కమిషన్ సభ్యులు, ఎన్జీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ '108' సిబ్బందికి రాష్ట్ర స్థాయి ఉత్తమ సేవా పురస్కారాలు




**హుజురాబాద్ ఏప్రిల్ 7(పీపుల్స్ డైరీ ) :** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్ర స్థాయి ఉత్తమ సేవా పురస్కారాలను అం దజేసింది. మం గళవారం హైద రాబాద్‌లోని రవీం ద్రభారతిలో నిర్వహించిన ఘనమైన కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా హుజురాబాద్ రూరల్ 108 సిబ్బంది సత్తా చాటారు. హుజురాబాద్ రూరల్ 108 విభాగంలో పనిచేస్తున్న రొంటాల సురేష్ కుమార్ రాష్ట్ర స్థాయి ఉత్తమ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ) గా, సుంకరి అశోక్ రెడ్డి రాష్ట్ర స్థాయి ఉత్తమ పైలట్ (డ్రైవర్ ) గా ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు దామోదర రాజనర్సింహ విజేతలకు అవార్డులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ క్రిస్టియానో, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ సంగీత, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ పాల్గొని అవార్డు గ్రహీతలను ప్రశంసించారు. ఆపదలో ఉన్న ప్రాణాలను కాపాడటంలో నిరంతరం శ్రమిస్తూ,నిబద్ధతతో విధులు నిర్వహించినందుకు గాను వీరిని ఈ పురస్కారాలకు ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. "ప్రజల ప్రాణాలను కాపాడే సేవలో లభించిన ఈ గుర్తింపు మా బాధ్యతను మరింత పెంచింది. మా సేవలను గుర్తించి అవార్డులు అందించిన ప్రభుత్వానికి, అధికారులకు రొంటాలా సురేష్ కుమార్, సుంకరి అశోక్ రెడ్డి ధన్యవాదాలు."తెలిపారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ప్రాంత ప్రజలు, తోటి సిబ్బంది, ఉ న్నతాధికారులు విజేతలకు ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు.

## సీఎంఆర్ కళాశాలపై వస్తున్న ఆరోపణలు అవాస్తవం

### బిఆర్ఎస్ నేత భాస్కర్ యాదవ్



**మేడ్చల్, ఏప్రిల్ 7 (పీపుల్స్ డైరీ) :** సీఎంఆర్ కళాశాలపై వస్తున్న ఆరోపణలలో నిజం లేదని మేడ్చల్ సర్కిల్ బిఆర్ఎస్ అధ్యక్షులు భాస్కర్ యాదవ్ తెలిపారు. సీఎంఆర్ కళాశాలపై వస్తున్న ఆరోపణ నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని తెలిపారు. సీఎంఆర్ కళాశాల నుండి డ్రైనేజీ నీరు వచ్చి పక్కనే ఉన్న సుతారి కూడా చెరువులో చేరుతుందని, దీనివల్ల చెరువు కాలుష్యం అవుతుందని పలువురు నేతలు చేసిన వ్యాఖ్యలను భాస్కర్ యాదవ్ ఖండించారు. సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ లో ఏర్పాటు చేసిన ఎస్ టి పి (సేవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్) ను మీడియా ప్రతినిధులకు చూపించారు. ఈ సందర్భంగా భాస్కర్ యాదవ్ మాట్లాడుతూ సీఎంఆర్ క్యాంపస్లో ఎస్టిపి ప్లాంట్ ఏర్పాటు చేసి శుద్ధి చేసిన నీటిని కళాశాల ప్రాంగణంలోని చెట్లకు వినియోగిస్తున్నారని తెలిపారు. సుతారిగూడ చెరువులోకి వెళ్తున్న మురుగనీరు కండ్లకోయ గ్రామ పంచాయతీకి చెందిందేనని తెలిపారు. ప్రజలకు హాని చేసే పనులు మల్లారెడ్డి కుటుంబం చేయదని, మల్లారెడ్డి కళాశాలకు ఎలాంటి నీటి కనెక్షన్ లేదని ఇకపై మల్లారెడ్డి పై అసత్య ఆరోపణ మానుకోవాలని లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదు-ర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు నవీన్ రెడ్డి కళాశాల చైర్మన్ గోపాల్ రెడ్డి విట్టల్, జంగారెడ్డి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ చేయని డెంటల్ ఎక్విప్మెంట్ మిషన్ డయాలసిస్



**ఏటూరు నాగారం ఏప్రిల్ 7 (పీపుల్స్ డైరీ) :** స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపెన్ చేయని డెంటల్ ఎక్విప్మెంట్ మిషన్, డయాలసిస్ లో సరైన సదుపాయాలు, సరిపోయే బెడ్స్ కు నోచుకోని ప్రభుత్వ ఆసుపత్రి వినుకొల్లు చక్రవర్తి బిజెపి మండల నాయకులు గత సంవత్సరన్నర కింద ఏటూరునాగారం లో ప్రభుత్వ హాస్పిటల్ లో వచ్చిన డెంటల్ ఎక్యుమెంట్ మిషన్ వచ్చి ఉన్నది కానీ దాని సదుపాయాలు ఇంతవరకు అందలేదు సామాన్య ప్రజలకు పట్టించుకోని అధికారులు డెంటల్ కు సంబంధించిన డాక్టర్ కు లక్ష రూపాయల వేతనం మరియు డయాలసిస్ పేరుకే డయాలసిస్ ఏటూరునాగారం లో ఇబ్బంది పడుతున్న ప్రజలు డయాసిస్ లో మరికొన్ని బెడ్స్ అరేంజ్ చేసి ప్రజల ప్రాణాలు కాపాడవలసిందిగా మనవి ఆక్సిజన్ సిలిండర్లు అందుబాటులో ఉంచుకుని విధంగా చూసుకోవాలి. పేషంట్ల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న వైద్య సిబ్బంది. అందుబాటులో లేని డాక్టర్స్. చుట్టూ పక్కల ఉన్న గ్రామాలకు, మండలాలకు అతిపెద్ద ఆస్పత్రిగా గుర్తింపు ఉన్న పేషంట్ల పట్ల సరేనా సదుపాయాలు నోచుకోనటువంటి ఏటూరునాగారం ఆసుపత్రి పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

## కొత్తపల్లి బస్టాండ్ లో ద్విచక్ర వాహనాలు నిలుపరాదు

### ముల్కనూర్ ఎస్సై రాజు

**ముల్కనూర్, ఏప్రిల్ 07:(పీపుల్స్ డైరీ ) :** సాయి నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తపల్లి బస్టాండ్ లో ద్విచక్ర వాహనాల పార్కింగ్ చేయరాదని ముల్కనూర్ ఎస్సై రాజు తెలిపారు. బస్టాండ్ లోపల వాహనాలను ఇష్టానుసారంగా నిలపడం వల్ల ప్రయాణికులు వేచి ఉండటానికి, బస్సులు ఎక్కడానికి తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. ఇకపై బస్టాండ్ ఆవరణ లోపల ఎలాంటి ద్విచక్ర వాహనాలను నిలపడానికి అనుమతి లేదని తెలిపారు. ఈ నిబంధనలను అతిక్రమించి వాహనాలను పార్క్ చేసే వారిపై 'నో పార్కింగ్' కింద కేసు నమోదు చేయడంతో పాటు, చట్టరీత్యా భారీగా చలానాలు విధించడం జరుగుతుందని తెలిపారు. గ్రామస్తులు,వాహనదారులు ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఎస్సై రాజు కోరారు.

# కేసముద్రం మున్సిపాలిటీ ప్రజలకు అవస్థలు తప్పవా...

**బిఆర్ఎస్ నాయకులు కన్నెబోయిన శ్రీనివాస్ యాదవ్...**



**కేసముద్రం ఏప్రిల్ 7 (పీపుల్స్ డైరి )** మున్సిపాలిటీ ప్రజలకు అవస్థలు తప్పడం లేదని కేసముద్రం మండల బిఆర్ఎస్ నాయకులు కన్నబోయిన శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా పత్రిక ప్రకటన విడుదల చేసి ఆయన మాట్లాడారు.. కేసముద్రం మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను పాలకవర్గం, అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని,వెంటనే వాటిని పరిష్కరించాలని తెలిపారు. పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని, దీంతో దోమలు విపరీతంగా పెరిగి స్వైర విహారం చేయడంతో ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మున్సిపాలిటీ పరిధిలో ఎవరైనా చనిపోతే శవాన్ని పెట్టడానికి ఫ్రీజర్ లేదని, శవాన్ని మోసుకెళ్ళడానికి వైకుంఠ రథం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న ఫ్రీజర్ నిరుపేదలకు భారంగా మారుతుందని, ఒక్కో శవానికి మూడు వేలకు పైపడే వసూలు చేస్తున్నారని, నిరుపేదలు ఇవ్వగలరా అని ఆవేదన వ్యక్తం చేశారు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా బడ్జెట్లో కోట్ల రూపాయలను కేటాయిస్తారు కానీ పనిలో మాత్రం రూపాయి కూడా ఖర్చు పెట్టారా అని ప్రశ్నించారు.ఇకనైనా పాలకవర్గం బాధ్యతయుతంగా పనిచేసి మున్సిపాలిటీ కేంద్రంలో నెలకొన్న సమస్యలన్నింటిని పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు...

# ప్రజల భద్రత లక్ష్యంగా సీసీ కెమెరాలు పునరుద్ధరణ

## మొగుళ్ళపల్లి ఎస్ఐ ముప్పు సురేష్



**మొగుళ్ళపల్లి ఏప్రిల్ 7 ( పీపుల్స్ డైరీ ):** మండల కేంద్రంలోని కొన్ని సీసీ కెమెరాలు పనిచేయకుండా, నిరుపేయోగంగా ఉండడాన్ని గమనించిన మొగుళ్లపల్లి ఎస్సై ముప్పు సురేష్, గ్రామంలోని ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని నిరుపయోగంగా ఉన్న సుమారు 24 సీసీ కెమెరాలను గ్రామంలో భద్రతా వ్యవస్థ కొంత మేర బలహీనపడిన పరిస్థితి నెలకొందని ఈ పరిస్థితి పునరావృతం కాకుండా మొగుళ్లపల్లి ఎస్సై ముప్పు సురేష్ స్వయంగా చొరవ తీసుకుని, ప్రత్యేక శ్రద్ధతో ముందుండి కెమెరాల మరమ్మతు పనులు చేపట్టించి, అన్ని సీసీ కెమెరాలు తిరిగి సక్రమంగా పనిచేసేలా చేశారు. ఆయన పట్టుదలతో చేసిన ఈ చర్య గ్రామ భద్రతను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించింది. సీసీ కెమెరాల పునరుద్ధరణతో గ్రామంలో నేరాల నియంత్రణకు దోహదపడటమే కాకుండా, అనుమానాస్పద సంఘటనలను పర్యవేక్షించేందుకు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు పోలీసులకు సహకారం లభిస్తోంది. దీంతో గ్రామ ప్రజల్లో భద్రతపై నమ్మకం పెరిగి, పోలీసులపై విశ్వాసం మరింత బలపడుతుందని ఎస్సై ముత్తు సురేష్ తెలిపారు .

# పామాయిల్ తోట దగ్ధం: 3 లక్షల ఆస్తి నష్టం



**గోవిందరావుపేట, ఏప్రిల్ 7( పీపుల్స్ డైరీ)** మండల పరిధి రాంనగర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మోహన్ రాథోడ్ కు చెందిన సుమారు అరెకరం పామాయిల్ ఆదివారం సాయంత్రం తోట కు నిప్పు అంటుకొని సుమారు3 లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని మోహన్ రాథోడ్ తెలిపారు, పామాయిల్ తోట ఏర్పాటు చేసిన పైపులైన్లు డ్రిప్పు పైపులు దగ్ధం కావడం జరిగిందని తెలిపారు, పామాయిల్ తోట దగ్గిరమైన విషయాన్ని సెరికల్చర్ అధికారులకు తెలియజేసినట్లు వివరించారు.

# గ్రామీణ వైద్యుల సేవలు అమోఘం



**గోవిందరావుపేట, ఏప్రిల్ 7( పీపుల్స్ డైరీ )** మండల కేంద్రానికి చెందిన పెండెం హేమాద్రి, చల్వాయి గ్రామానికి చెందిన యాస వెంకటరెడ్డిల సేవలు అమోఘమని అన్నారు, ఇరువురు గ్రామీణ వైద్యులు ఎలాంటి వైద్య సౌకర్యం లేని రోజుల్లో ప్రజలతో మమేకమై వారికి తోచిన వైద్య సేవలు గ్రామీణ ప్రజలకు అందజేయడం జరిగిందని గ్రామీణ ఆదర్శ వైద్యుల సంఘం అన్నారు, గ్రామీణ ఆదర్శ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించి శాలువాతో సన్మానించడం జరిగింది, ఇరువురు గ్రామీణ వైద్యులు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని గ్రామీణ వైద్యుల సంఘం సభ్యులు అన్నారు.

# నూతన తాహాశిల్దార్ సూర్యనారయణ.. ఎమ్మెల్యేకి మర్యాద పూర్వక కలయిక



**ఇల్లందు , ఏప్రిల్ 7( పీపుల్స్ డైరీ )** ఇల్లందు మండలం నూతన తాహాశీల్దార్ గా నియమితులైన సూర్యనారయణ, ఈరోజు క్యాంప్ కార్యాలయం నందు ఎమ్మెల్యే కి మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛం అందచేసి కలిసారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మండల వ్యాప్తంగా ఉన్న సమస్యలు రెవిన్యూ సమస్యల పరిష్కారం దిశగా పనిచేయాలని సూచించారు.

# రోగులకు 'కొండంత' అండగా నిలవాలి..!

- ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్
- ఆరోగ్య స్పృహ పెంపొందించడంలో ఆశా, హెల్త్ సిబ్బంది పాత్ర కీలకం
- ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తేనే సమాజం సుసంపన్నం
- ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా చెల్పూర్ పీహెచ్‌సీలో సదస్సు

గణపురం, ఏప్రిల్ 07 (పీపుల్స్ డైరీ):వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మందుల కంటే ముందుగా అవసరమయ్యేది నైతిక ధైర్యమని, వైద్య సిబ్బంది వారికి కొండంత అండగా నిలవాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్ పిలుపునిచ్చారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆశా కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్‌లు గ్రామాల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంలో ముందుండాలని సూచించారు. ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కావాటి రజిత రవీందర్, డీఎంహెచ్‌వో



మధుసూదన్, పిపి బొట్ల సుధాకర్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆకుల రాములు, లీగల్ ఎయిడ్ కౌన్సెల్స్ శ్రీనివాస్, అక్షయ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్వాతి, హెచ్ఎస్ విజయలక్ష్మి, పరమేశ్వర్, న్యాయవాదులు రాజ్‌కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణి చేసిన ఎమ్మెల్యే కోరం

**ఇల్లందు (భద్రాద్రి కొత్తగూడెం) ఏప్రిల్ 7 (పీపుల్స్ డైరీ)** మండలంకు చెందిన 77 మంది లబ్ధిధారులకు 25లక్షల53వేల రూపాయల చెక్కులు ఎమ్మెల్యే చే పంపిణి. తెలంగాణ రాష్ట ప్రజా ప్రభుత్వం పేద ప్రజలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెతృత్వంలో ముఖ్యమంత్రి సహాయనిధి పేరిట ఇల్లందు ఎమ్మెల్యే కార్యాలయం నందు పంపిణి చేస్తున్న సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణి కార్యక్రమానికి ముఖ్య అతిధిగాలి హజరై ఇల్లందు మండలం, పట్టణం కు చెందిన 103మంది లబ్ధిధారులకు 33,16,500 రూపాయల విలువ గల చెక్కులను లబ్ధిధారులకు పంపిణి చేసిన ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య.





ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మున్సిపాలిటి చైర్మెన్ దొడ్డా కిరణ్ మిత్ర డానియల్, వైస్ చైర్మెన్ పెండేల రాజు, ఇల్లందు మండలం మాజీ వైస్ ఎంపిపి మండల రాంమహేష్,ఇల్లందు మండల పార్టీ అధ్యక్షులు పులి సైదులు, నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ళ సూర్యం, గందె సదానందం,సర్పంచులు వల్లాల మంగమ్మ, పాయం స్వాతి,బానోత్ శారద,పాయం లలిత, బొడా కిషోర్, అరెం ప్రియంకా, ఈసం బాలక్రిష్ణ, బానోత్ లక్ష్మీ శ్రీను,ఉప సర్పంచులు అరెం కిరణ్, ధారవత్ చంద్రశేఖర్, కౌన్సలర్స్ షేక్ సైదిమియా, అజ్మీర వంశీ, ఎండి ఖుష్బు మునావర్, చిల్లా విజయభారతి శ్రీనివాస్, రాధ కమల్ కోరి,రేఖ స్వరుపా రవి శంకర్, నీరుడు ఉపేంద్ర శివలాల్, ఉల్లింగ విజయలక్ష్మీ సతీష్, ఎండి. జాఫర్,కొర్లపాటి కిరణ్, నాయకులు తాటి భిక్షం,మూతి క్రిష్ణ, కిన్నెర నర్సయ్య, కాకటి భార్గవ్, చెనిగరపు రమేష్,ఈసం లక్ష్మణ్, గలిపల్లి స్వరూప, మాజీ సర్పంచ్ కల్తీ పద్మ,బండి ఆనంద్, దండుగుల శీవ,తదితరులు పాల్గోన్నారు

# టెండర్ విధానానికి వ్యతిరేకంగా చేనేత కార్మికుల ధర్నా

- టెక్స్ విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వానికి వినతి
- బాసని బాలకృష్ణ అఖిలభారత పద్మశాలి జిల్లా ప్రచార కార్యదర్శి



శాయంపేట, ఏప్రిల్ 7,(పీపుల్స్ డైరీ) : రాష్ట్ర ప్రభుత్వం టెక్స్ విధానాన్ని రద్దు చేసి టెండర్ విధానాన్ని ప్రవేశపెట్టడంపై చేనేత కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ టెండర్ విధానం వల్ల చేనేత రంగం ప్రైవేటీకరణ దిశగా వెళ్లి, సంప్రదాయ కార్మికులకు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అమలులోకి తీసుకురావాలని భావిస్తున్న టెండర్ విధానం ద్వారా ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు వస్త్రాల కొనుగోలు ప్రక్రియలో పాల్గొనే అవకాశం కల్పించబడుతుందని, దీనివల్ల చిన్నతరహా చేనేత కార్మికులు పోటీ చేయలేక తీవ్ర నష్టపోతారని కార్మికులు పేర్కొన్నారు. ఈ విధానం అమలైతే చేనేత పద్మశాలి కార్మికులు పనిలేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో చేనేత కార్మికులు పెద్దఎత్తున ధర్నా నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు. టెండర్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, గతంలో అమలులో ఉన్న టెక్స్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. టెక్స్ విధానం ద్వారా చేనేత కార్మికులకు నిరంతర ఉపాధి లభించిందని, వారి జీవనోపాధి స్థిరంగా కొనసాగిందని వారు గుర్తుచేశారు.




ప్రభుత్వం వెంటనే స్పందించి చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, వారికి చేతినిండా పని కల్పించే విధానాలను అమలు చేయాలని వారు కోరారు.

చేనేత రంగాన్ని కాపాడాలంటే టెక్స్ విధానాన్ని కొనసాగించడం అత్యవసరమని కార్మికులు స్పష్టం చేశారు.

# కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**అర్హులందరికీ పథకాల లబ్ధి అందిస్తా : ఎమ్మెల్యే**



కరకగూడెం, ఏప్రిల్ 07,(పీపుల్స్ డైరీ) : కరకగూడెం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు కల్యాణ లక్ష్మి మరియు షాది ముబారక్ పథకాల కింద చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 29 మంది లబ్ధిదారులకు రూ. 29,03,364 విలువైన ఆర్థిక సహాయం అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన అమ్మాయిల వివాహాలకు ప్రభుత్వం అందిస్తున్న కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. ఈ పథకాల ద్వారా పేద కుటుంబాలపై పడే ఆర్థిక భారం తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరేలా కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు.అంతకు ముందు కన్నాయి గూడెం పంచాయతీ, భట్టుపల్లి పంచాయతీ లలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం ఇంటి యజమానులతో కలసి గృహ ప్రవేశం చేశారు. కన్నాయి గూడెం పంచాయతీ లో 2 ఇళ్ళు,భట్టుపల్లి పంచాయతీ లో 2 ఇళ్ల చొప్పున గృహ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అందరు పూర్తి చేయాలని ఈ సందర్భంగా లబ్ధిదారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ దినేష్ కుమార్, ఇంచార్జి తహసీల్దార్ వట్టం కాంతయ్య ఎంపీడీఓ దేవవర కుమార్, ఏంఈఓ మంజుల,ఎంపీఓ మారుతీ,హౌసింగ్ ఏఈ గుమ్మడి వినీత, ఏపీఎం తదితర అధికారులు పాల్గొన్నారు. అలాగే మండల కాంగ్రెస్ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, సీనియర్ నాయకులు యర్ర సురేష్, రాందాస్ నాయక్, జలగం క్రిష్ణ, పోలేబోయిన తిరుపతయ్య, నాగబండి వెంకటేశ్వర్లు, , పడిగ సమ్మయ్య, నేతాజీ, సాగర్, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు. సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డ్ మెంబర్లు, రెవెన్యూ మరియు పంచాయతీ అధికారులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు....

# అమెరికా, ఇజ్రాయిల్ ఇరాన్ పై చేస్తున్న యుద్ధాన్ని ఆపాలి

**ప్రపంచ శాంతిని నెలకొల్పాలి**

**వామపక్ష పార్టీల ప్రజా సంఘాల డిమాండ్**

మట్టెవాడ, ఏప్రిల్ 07 (పీపుల్స్ డైరీ): ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు చేస్తున్న యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ప్రపంచ శాంతిని కాపాడుకోవాలని వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి వరంగల్ చౌరస్తా వరకు మహా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ఎంసిపిఐ యు వరంగల్ నగర కార్యదర్శి మాలోత్ సాగర్ అధ్యక్షతన వహించగా ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి భాషుమియా, రాష్ట్ర నాయకులు మేకల రవి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు నలిగంటి రత్నమాల, ఎంసిపిఐయు జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ, ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి గంగుల దయాకర్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి అక్కనపల్లి యాదగిరి, ఏఐసిటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఆరూరి కుమార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి శ్రీనివాస్, విద్యార్థి, యువజన సంఘం నాయకులు వలీ వుల్లా ఖాద్రీ, మహేష్ లు పాల్గొని మాట్లాడుతూ పశ్చిమాసియా దేశాలలో నెల రోజుల క్రితం ప్రారంభమైన యుద్ధం ఇప్పట్లో ఆగేలా లేదని అన్నారు. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు చేస్తున్న దాడులు రోజురోజుకీ తీవ్రతరం అవుతున్నాయని అన్నారు




పశ్చిమాసియా యుద్ధంలో అమాయక ప్రజలు చవిచూస్తున్న ఇబ్బందులు అన్ని ఇన్ని కావని అన్నారు. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు జరుపుతున్న దాడులు వాటికి ప్రతీకారంగా గల్ఫ్ దేశాలపై టెహ్రాన్ చేపట్టిన ప్రతిఘటన దాడులలో పాఠశాలలు, ఆస్పత్రులు, విమానాశ్రయాలు జనావాస ప్రాంతాలను లక్ష్యంగా పెట్టుకొని యుద్ధం చేస్తుందని అన్నారు. దీనివలన వేలాది మంది ప్రజలు చనిపోవడం క్షతగాత్రులై జీవచ్ఛాలుగా మారడమా జరుగుతుందని భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ యుద్ధాన్ని ఆపాలని ప్రపంచ శాంతిని కోరుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కోరడం లేదని పట్టీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నాడని తద్వారా దేశంలో గ్యాస్ దొరకకపోవడం వల్ల చిన్నచిన్న హోటల్ లను మూసేసుకొని వారి జీవనోపాధి కోల్పోయే పరిస్థితి వచ్చిందన్నారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయని ధరలు అదుపు చేయడంలో నరేంద్ర మోడీ పూర్తిగా విఫలమయ్యారని వామపక్ష పార్టీల నాయకులు దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రపంచ శాంతిని కోరుకునే విధంగా నరేంద్ర మోడీ యుద్ధాన్ని ఆపే విధంగా ప్రయత్నం కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. యుద్ధం ఇలాగే కొనసాగితే భారతదేశంలో ద్రవ్యోల్బణం పెరిగి ఆర్థిక సంక్షోభంలో పడే ప్రమాదం ఉందని అన్నారు. కావున ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను తక్షణమే ఆపాలని లేనిచో రాబోయే రోజులలో పెద్ద ఎత్తున ఆందోళ ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంసిపిఐ యు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సుంచు జగదీశ్వర్, సిపిఎం నాయకులు సింగారపు బాబు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎండి.బషీర్, దుర్గయ్య, విద్యార్థి సంఘం నాయకులు ల్యాదెల్ల శరత్, సిపిఐ నాయకులు దండు లక్ష్మణ్, గుండె బద్రి, బుస్స రవి, టి.రాయల, ఎంసిపిఐ యు నాయకులు గణిపాక ఓదెలు, ల్యాదళ్ళ శివ, ఎగ్గని మల్లికార్జున్, గోవర్ధన్ రాజు, మాలి ప్రభాకర్, అప్పనపూరు నరసయ్య, టీ.జాన్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ, సమావేశం

### హెల్త్ క్యాంప్ నిర్వహణ

మట్టెవాడ, ఏప్రిల్ 07 (పీపుల్స్ డైరీ): ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్‌లో విస్తృత స్థాయిలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. మంగళ వారం ఉదయం ఎంజీఎం ఆసుపత్రి నర్సింగ్ కళాశాల వద్ద నుండి ఎంజీఎం కూడలి వరకు "ఆరోగ్యమే మహాభాగ్యం" అంశంపై నిర్వ హించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా అధికారులు, నర్సింగ్ విద్యార్థులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్న ఈ ర్యాలీ ఎంజీఎం కూడలి మీదుగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్ వరకు కొనసాగింది. మార్గమధ్యంలో "మానవ హారం" కార్యక్రమం నిర్వహించి, ఆరోగ్యమే మహాభాగ్యం అనే సందేశాన్ని స్లోగన్ల ద్వారా ప్రజలకు, బాట సారులకు చేరవేశారు. తదనంతరం ఐఎంఎ హాలులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వ ర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ సాంబశివరావు అధ్యక్షత వహించారు. ఈ





సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మాట్లాడుతూ "టుగెదర్ ఫర్ హెల్త్ – స్టాండ్ విత్ సైన్స్" అనే థీమ్‌ను ప్రస్తావిస్తూ ప్రజలు శాస్త్రీయ దృక్పథంతో ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉండాలని సూచించారు. ఆరోగ్యం అనేది కేవలం వ్యాధుల లేమి మాత్రమే కాకుండా శారీరక, మానసిక, సామాజిక సంక్షేమం కలగలిపిన సమగ్ర స్థితి అని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో సమతుల ఆహారం తీసుకోవడం, నియమిత వ్యాయామం చేయడం, పరిశుభ్రత పాటించడం వంటి అలవాట్లను తప్పనిసరిగా అలవరచుకోవాలని సూచించారు.

అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి.సంధ్యా రాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి.గణేష్ మాట్లాడుతూ ఆరోగ్యకర జీవన విధానంపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మిల్లెట్ ఆహారపు ప్రాముఖ్యతను వివరించడంతో పాటు, ప్రజలు పోషకాహారం తీసుకోవడం అవసరమని తెలిపారు. జడ్పీ సీఈవో రామిరెడ్డి యాక్టివ్ జీవనశైలిని అలవరచుకోవాలని సూచించగా, డీసీవో నీరజ మానసిక, శారీరక ఆరోగ్య సమతుల్యతపై అవగాహన కల్పించారు. డిహెచ్ఎస్ఓ శ్రీనివాసరావు రసాయనాలు లేని ఆహారం, పండ్ల వినియోగం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని వివరించారు. అనంతరం ఎంజీఎంలో జిల్లా అధికారులకు, ఉద్యోగులకు ప్రత్యేక హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంపులో జిల్లా కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్లు జి.సంధ్యారాణి, వై.వి.గణేష్ తదితరులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆదనపు కలెక్టర్ సంధ్యారాణి అందరితో ఆరోగ్య సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్స్ హరిచంద్రారెడ్డి, జిల్లా అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భయానక హత్య కేసులో తీర్పు

## రౌడీ షీటర్ అంగోత్ హరీష్‌కు జీవిత ఖైదు

కేసముద్రం, ఏప్రిల్ 7( పీపుల్స్ డైరీ ) ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలనే ఉద్దేశంతో అమాయక వ్యక్తిని అత్యంత దారుణంగా హత్య చేసిన కేసులో నిందితుడికి కోర్టు జీవిత ఖైదు విధించింది. ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. 2020 ఆగస్టు 23 అర్ధరాత్రి సమయంలో కేసముద్రం రైల్వే స్టేషన్ పరిసరాల్లో ఈ ఘోరం చోటుచేసుకుంది. గిర్నీతండాకు చెందిన అంగోత్ హరీష్ (30) అనే రౌడీ షీటర్, అనంతపురం జిల్లాకు చెందిన వెంకన్న (40) అనే బిచ్చగాడిని లక్ష్యంగా చేసుకుని పారా తో దాడి చేసి హత్య చేశాడు. అనంతరం కత్తితో తలను మొండెం నుంచి వేరు చేసి, శవాన్ని వేర్వేరు ప్రదేశాల్లో పడేయడం ద్వారా ప్రజల్లో భయం కలిగించాలనుకున్నాడు. ఈ ఘటనపై అప్పటి ఎస్సై బి. సతీష్, వీఆర్ఓ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.






మహబూబాబాద్ రూరల్ సీఐలుగా పనిచేసిన జె. వెంకటరత్నం, పి. రవికుమార్‌లు సాక్ష్యాధారాలు సేకరించి నిందితుడిని అరెస్ట్ చేసి చార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేశారు. తదుపరి విచారణలో, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎస్పీ తిరుపతి రావు పర్యవేక్షణలో కేసముద్రం సీఐ సత్యనారాయణ, ఎస్సైలు క్రాంతి కిరణ్, నరేష్‌లు కేసును సవాల్‌గా తీసుకున్నారు. ప్రతి సాక్షిని సమగ్రంగా సిద్ధం చేసి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు సీడీఓ అశోక్ రెడ్డి సాక్ష్యాలను సమర్థవంతంగా ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపెల్లి వెంకటయ్య వాదనలు వినిపించారు. సమగ్ర విచారణ అనంతరం కోర్టు నిందితుడు అంగోత్ హరీష్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.30 వేల జరిమానా విధించింది. రౌడీషీటర్‌పై పలు కేసులునిందితుడిపై ఇప్పటికే అక్రమ వసూళ్లు, హత్యాయత్నం, దాడులు, దొంగతనం, మహిళలపై వేధింపులు వంటి మొత్తం 18 కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసముద్రం ప్రాంతంలో దుకాణదారులను బెదిరించి డబ్బులు వసూలు చేయడం, ఇవ్వని వారిపై దాడులు చేయడం వంటి చర్యలతో ప్రజలను భయపెట్టేవాడని సమాచారం. ఈ తీర్పుతో కేసముద్రం ప్రాంత ప్రజల్లో కొంత ఊరటనిచ్చింది. రౌడీషీటర్ నుంచి ఇబ్బందులు లేకుండా చేయడానికి కృషి చేసిన పోలీసు అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్






**మొగుళ్లపల్లి ఏప్రిల్ 7 (పీపుల్స్ డైరీ) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మంగళవారం మొగుళ్ళపల్లి మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. జిల్లా అదనపు కలెక్టర్ పాత ఇసిపేట గ్రామంలో జరుగుతున్న జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పని ప్రదేశంలో అదనపు కలెక్టర్ కూలీల హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం అదే గ్రామంతో పాటు మొగుళ్ళపల్లి గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి మేస్త్రీలతో ఇంటి నిర్మాణం పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించగా. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ప్రస్తుతం మండలంలో ఇసుక రవాణకు అధికారులు పర్మిషన్ ఇవ్వడంలేదని తెలుపగా లబ్ధిదారులందరూ ఆన్లైన్లో అప్లై చేసుకోవాల్సిందిగా సూచించారు. అనంతరం మొగుళ్లపల్లి జడ్పీహెచ్ఎస్ లో జరుగుతున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పీహెచ్సీ డాక్టర్ నవత ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేయగా జిల్లా అడిషనల్ కలెక్టర్ పాల్గొని అసంక్రమణ వ్యాధులు అయినటువంటి బీపీ షుగర్ క్యాన్సర్ లాంటి వ్యాధులను అరికట్టేందుకు ఆశా కార్యకర్తలు పాత్ర కీలకమైనదని తెలియజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు. బీసీ హాస్టల్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి సురేందర్, ఏపీవో మాధవి, మొగుళ్లపల్లి గ్రామ సర్పంచ్ చాట్ల విజయ రవీందర్, ఈసీ రాము, జిపి సెక్రటరీ నరేష్, జిల్లా అదనపు కలెక్టర్ వెంట ఉన్నారు.

## అడిషనల్ కలెక్టర్ తనిఖీ

**చిట్యాల, ఏప్రిల్ 7 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రంలో నిర్మాణం జరుగుతున్న కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ ను అలాగే నర్సరీలో జరుగుతున్న పనులను పెరుగుతున్న మొక్కలను జయశంకర్ భూపాలపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు. ఆయా పనుల పట్ల అడిషనల్ కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఏపీవో అలీమ్ టెక్నికల్ అసిస్టెంట్ ఈసి సుధాకర్ పాల్గొన్నారు.

# కార్మికోద్యమ నేత బీటీ రణదీవ్ ఆశయ సాధన కోసం ఉద్యమించాలి

### సిఐటియు జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్,

గోవిందరావుపేట, ఏప్రిల్ 7( పీపుల్స్ డైరీ ) కార్మికోద్యమ నేత బీటీ రణదేవ్ ఆశయ సాధన కోసం ఉద్యమించాలని సిఐటియు ములుగు జిల్లా నాయకులు రక్తం రాజేందర్ పిలుపునిచ్చారు, సోమవారం పసర సిఐటియు కార్యాలయంలో బీటీ రణదీవ్ 32 వ వర్ధంతి పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి రాజేందర్ పూలమాలవేసి నివాళులర్పించారు, అనంతరం రాజేందర్ మాట్లాడుతూ బీటీ రణదేవ్ 1904 డిసెంబర్ 19 న మహారాష్ట్ర బాంబేలో జన్మించారని అన్నారు, రణదేవ్ బ్రిటిష్ బ్రిటిష్ పాలకులు వ్యతిరేకంగా పోరాటంలో పాల్గొనడం జరిగిందన్నారు, బ్రిటిష్ ప్రభుత్వం హయాంలోనే ముంబై రాష్ట్రంలో కార్మికుల సంఘాలను స్థాపించి అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు తెలిపారు, కార్మిక వర్గ ప్రయోజనాల కోసం బీటీ రణ దీ వ్ తండ్రి మృతి చెందినప్పటికీ అంత్యక్రియలకు హాజరు కాకుండా పోరాటాలలోనే నిమగ్నమయ్యారని అన్నారు, అన్న తల్లిదండ్రుల కంటే కార్మిక వర్గానికి ఆయన ఎనలేని సేవలు చేసిన మహామవులని కొనియాడారు, ప్రజలపై పన్నుల ప్రారంభించడంతో కార్మిక కార్మికులు దుర్భర జీవితాన్ని అనుభవిస్తు ఆకలికి చావులు, రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగ పెరుగుదల అలాంటి సమస్యలపై ప్రజలకు వెన్న అంటుంది కార్మికు ఉద్యమాన్ని నిర్మించడమే ఆయన లక్ష్యంగా ఎంచుకున్నారని అన్నారు, ఈ



కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు కే రఘుపతి, తుమ్మల వెంకటరెడ్డి, సోమ మల్లారెడ్డి, ఎండి దావూద్, చిట్టిబాబు,జి ఐలయ్య, దామోదర్, ప్రభాకర్, రమ్య, రాజేశ్వరి, గణేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల హామీలు వెంటనే అమలు చేయాలి

### ఉద్యమకారుల మండల అధ్యక్షుడు బానోతు లాలు

నర్సింహులపేట, ఏప్రిల్ 7 ( పీపుల్స్ డైరీ):తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉద్యమకారుల మండల అధ్యక్షుడు బానోతు లాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు పలు హామీలు ఇచ్చిందని, వాటి అమలులో ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని విమర్శించారు.

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 18న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న "చలో హైదరాబాద్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం పిలుపునిచ్చిందన్నారు. ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొని తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు రావాలని బానోతు లాలు విజ్ఞప్తి చేశారు.



# కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు నిత్యావసర సరుకులను సమయానికి, పారదర్శకంగా అందిస్తుంది

శాయంపేట, ఏప్రిల్ 7 (పీపుల్స్ డైరీ) : మండలంలోని మాందారి పేట గ్రామంలో బడుగు అశోక్ కి చెందిన నూతన రేషన్ షాపును భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజలకు నిత్యావసర సరుకులను సమయానికి, పారదర్శకంగా అందిస్తుందని తెలిపారు. గ్రామ స్థాయిలో రేషన్ దుకాణాల ఏర్పాటు ద్వారా ప్రజలకు సులభంగా సరుకులు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కొత్త రేషన్ షాప్ ద్వారా మాందారిపేట గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగం కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ప్రజలు కూడా రేషన్ సరుకులను సద్వినియోగం చేసుకుని కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగు పర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డిఓ ,శాయంపేట మండలం ఎమ్మార్వో ప్రవీణ్ కుమార్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# పార్థివ దేహానికి నివాళులర్పించిన మండల అధ్యక్షుడు

**చిట్యాల, ఏప్రిల్ 7 (పీపుల్స్ డైరీ) :** మండల కేంద్రం రామ్ నగర్ కాలనీకి చెందిన చిలివేరి తిరుపతి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూట్ల తిరుపతి నాయకులతో కలిసి నివాళులర్పించి ఆర్థిక సాయం అందజేసి వారి కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించారు. వారి వెంట చిట్యాల మాజీ ఎంపీటీసీ కట్కూరి పద్మ నరేందర్ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య బీసీ సెల్ మండల అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ వార్డు సభ్యులు శనిగరపు మొగిలి నాయకులు సరిగోమ్ముల సదయ్య గుర్రపు అశోక్ మోలుగురి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# కొత్త, పాత చెరువులకు గ్రామస్తుల సమక్షంలో వేలం పాట నిర్వహణ

**నర్సింహులపేట, ఏప్రిల్ 7 ( పీపుల్స్ డైరీ) :** మండలంలోని కొమ్ములవంచ గ్రామపంచాయతీ పరిధిలో చేపల పెంపక హక్కుల కోసం చెరువులు, కుంటలకు మంగళవారం వేలం పాటను గ్రామస్తుల సమక్షంలో నిర్వహించారు. మత్స్యశాఖ డీఎఫ్ఓ భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పుప్పాల రవీందర్, ఉప సర్పంచ్ డొనికెన రామ్మూర్తి అధ్యక్షత వహించారు. వేలం పాటలో కొత్త చెరువును డోనికని జంపయ్య రూ.31 వేలుకు దక్కించుకోగా, పాత చెరువుకు గట్టి పోటీ నెలకొని చివరకు గుండగాని గోపి రూ.1.35 లక్షలకు సొంతం చేసుకున్నారు. ఈ వేలం ద్వారా గ్రామపంచాయతీకి గణనీయమైన ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ కిన్నెర యాకయ్య, మత్స్యశాఖ సిబ్బంది శ్రీనివాస్, విష్ణు, శ్రీపతి, రూప్ల తండా సర్పంచ్ లచ్చు నాయక్ గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యా సామాగ్రి పంపిణీ



**చిట్యాల, ఏప్రిల్ 7 (పీపుల్స్ డైరీ) :** మండలంలోని చల్లగరిగ గ్రామంలోని జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఎగ్జామ్ ప్యాడ్లు పెన్నులు పెన్సిళ్లు స్కేలు రబ్బర్లు వంటి అవసరమైన సామగ్రిని గ్రామ సర్పంచ్ సిరిపెల్లి జంపయ్య విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. మీ లక్ష్యాలను నిర్ణయించుకుని వాటిని చేరేందుకు కృషి చేయండి అని సూచించారు. అలాగే ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ ఎండి రహీమ్ పాషా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి తన ప్రతిభను చాటాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి అని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ సర్పంచ్ సేవలను ప్రశంసిస్తూ విద్యార్థుల అభివృద్ధికి ఆయన అందిస్తున్న సహకారం అభినందనీయం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు మరియు విద్యాభిమానులు పాల్గొన్నారు.

# గుడుంబా స్థావరంపై పోలీసుల ఆకస్మిక దాడి

### 15లీటర్ల గుడుంబా స్వాధీనం

**చిట్యాల, ఏప్రిల్ 7 (పీపుల్స్ డైరీ) :** సమాజానికి శాపంగా మారిన నాటు సారా (గుడుంబా) నిర్మూలనలో భాగంగా చిట్యాల పోలీసులు మంగళవారం కీలక చర్య చేపట్టారు. మండల పరిధిలోని పసిగడ్డ తండాలో గుడుంబా తయారు చేస్తున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ తన సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడి నిర్వహించారు. ?పసిగడ్డ తండాలో గుడుంబా తయారు చేస్తూ పట్టుబడిన లావుడ్య సమ్మయ్య (అలియాస్ తైలాల్) అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుండి సుమారు 15 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే గుడుంబా తయారీకి వినియోగిస్తున్న సామగ్రిని సంఘటనా స్థలంలోనే పోలీసులు ధ్వంసం చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

?ఈ సందర్భంగా ఎస్ఐ సతీష్ మాట్లాడుతూ గతంలో గుడుంబా కేసుల్లో పట్టుబడిన వారు కూడా తమ పద్ధతి మార్చుకోకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడుంబా తయారీ మరియు విక్రయాల వల్ల ఎన్నో కుటుంబాలు చితికిపోతున్నాయని గతంలో కేసులు ఉన్న వ్యక్తులు మారకపోతే ఇకపై వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం అన్నారు.

అటువంటి వారిని గుర్తించి బైండోవర్ చేస్తాం అని ఆయన హెచ్చరించారు. ?ఈ దాడుల్లో ఎస్ఐ తో పాటు హెడ్ కానిస్టేబుల్ యాకయ్య కానిస్టేబుల్స్ లాల్ సింగ్ రంజిత్ రాజు మరియు హోమ్ గార్డ్ రాజయ్య పాల్గొన్నారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT SATYANARAYANA PRINTERS, H.NO.4-6-144, TILAK ROAD, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA, STATE. PUBLISHED AT H.NO. 10-3-488, OPP: RTC WORK SHOP, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA STATE,
**EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044,** e-mail : peoplesdairydaily@gmail.com